సత్యసాయి సేవలకు సాటి లేదు

మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్

మానవతా దీప్తి సత్యసాయి

ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు

ముగిసిన సేవాదళ్ అంతర్జాతీయ సదస్సు

భక్తులతో కిటకిటలాడిన ప్రశాంతి నిలయం



మాట్లాడుతున్న మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్

సాయిప్రేమ

విశ్వవ్యాప్తం



నేడు పుట్టపర్తికి రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి

- సత్యసాయి శత జయంతి వేడుకలకు హాజరు
- స్వాగతం పలకనున్న సీఎం చంద్రబాబు
- నేడు మంత్రి నారా లోకేశ్ రాక
- భద్రతను కట్టుదిట్టం చేసిన పోలీసు యంత్రాంగం

పుట్టపర్తి టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సత్యసాయి శత జయంతి వేడుకలకు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ శనివారం హాజరు అవుతున్నారు. ప్రశాంతి నిలయంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ జరిగే వేడుకలలో రాష్ట్రపతి పాల్గొంటారు. సాయంత్రం జరిగే సత్యసాయి వర్సిటీ స్నాతకోత్సవంతో ఉపరాష్ట్రపతి పాల్గొంటారు. మరుసటి రోజు ఆదివారం జరిగే సత్యసాయి జయంతి ఉత్సవాల లోనూ ఉపరాష్ట్రపతి పాల్గొంటారు. సీఎం చంద్రబాబు శని, ఆదివారాలు రెండు (మిగతా 6లో..)

పుట్టపర్తి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సత్యసాయి సేవలకు సాటి లేదని, ఆయన ప్రేమతత్వం విశ్వవ్యాప్తమని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ కొనియాడారు. పుట్టపర్తిలో జరుగుతున్న సత్యసాయి శత జయంతి వేడుకలలో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంతులో సత్యసాయి మహా సమాధిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీసత్యసాయి అంతర్జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సత్యసాయి బోధించిన 'అందరినీ ప్రేమించు.. అందరినీ సేవించు' అనే నినాదాన్ని ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది భక్తులు ఆచరిస్తున్నారని అన్నారు. సత్యసాయి ప్రేమ, సేవ, ఆధ్యాత్మికత భక్తులకు జీవన ప్రమాణంగా మారిందని అన్నారు. సత్యసాయి మానవతా దీప్తి అని, నిస్వార్థ సేవలకు ప్రతిరూపమని ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు కొనియాడారు. సత్యసాయి ప్రేమతత్వాన్ని



ఆచరిస్తే ప్రతి వ్యక్తి జీవితం శాంతిమయంగా సాగుతుందని అన్నారు. సత్యసాయి మానవ రూపంలో ఉన్న ప్రేమ, సేవ, ఆధ్యాత్మిక దైవమని రాజ్యసభ సభ్యుడు అశోక్‌చవాన్ కొనియాడారు. తాను 55 సంవత్సరాలుగా ప్రశాంతి నిలయానికి వస్తున్నానని, ప్రశాంతి నిలయంలో సత్యసాయి దర్శనంతో (మిగతా 6వ పేజీలో..)

నేడు సత్యసాయి వర్సిటీ స్నాతకోత్సవం

- ముఖ్య అతిథిగా ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్



శ్రీసత్యసాయి యూనివర్సిటీ 44వ స్నాతకోత్సవం పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో శనివారం జరగనుంది. చాన్సలర్ చక్రవర్తి అధ్యక్షతన జరిగే ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హాజరవుతున్నారు (వివరాలు మెయిన్‌లో)

మాక్ అసెంబ్లీకి ఎంపికైన విద్యార్థులను అభినందించిన డీఈఓ



మాక్ అసెంబ్లీకి ఎంపికైన విద్యార్థులతో డీఈఓ ప్రసాద్‌బాబు, విద్యాశాఖ అధికారులు

అనంతపురం విద్య, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఈనెల 26న విద్యార్థులతో శాసనసభలో మాక్ అసెంబ్లీ నిర్వహిస్తోంది. మాక్ అసెంబ్లీకి ప్రత్యేక పరీక్షలు నిర్వహించి ప్రతి నియోజకవర్గం నుంచి ఒక విద్యార్థిని ఎంపిక చేసింది. అనంత జిల్లా నుంచి 8 నియోజకవర్గాలకు ఎనిమిది మంది విద్యార్థులను విద్యాశాఖ ఎంపిక చేసింది. మాక్ అసెంబ్లీకి జి.గంగోత్రి, ఎం.లోకేష్, ఎం.స్వప్న, పి.అనిల్‌కుమార్, కె.శిరీషా, ఎస్.సదాఫ్‌నాజ్, తలారి అభిజ్ఞ, ఎం.శ్యామ్‌శ్రీనాథ్‌రెడ్డి ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులు శుక్రవారం డీఈఓ ప్రసాద్‌బాబు, డిప్యూటి డీఈఓ మల్లారెడ్డి, ఏడీలను కలిశారు. విద్యార్థులను వారు అభినందించారు. మాక్ అసెంబ్లీ ఎలా ఉంటుంది, ఎలా ప్రిపేర్ కావాలి, నియోజకవర్గ సమస్యలు, అభివృద్ధి గురించి అవగాహన పెంచుకొని వెళ్లాలని విద్యార్థులకు డీఈఓ సూచించారు. కార్యక్రమంలో ఏడీ మునీర్, హెచ్‌ఎంలు, ఐటీసెల్ ఏఎస్‌ఓ శ్రీనివాసులు, ఏపీఓ మంజునాథ్ పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాల్లో అనర్హులు..!

- కనీస పరిజ్ఞానంలేని పలువురు ఆపరేటర్లు
- అప్‌డేట్లలో విఫలం

6

అన్నదాతల ఆనందం

ఖాతాల్లో జమైన అన్నదాత సుఖీభవ డబ్బులు

సొమ్ము కోసం బ్యాంకులకు క్యూ కట్టిన రైతులు

6

కరుగుతున్న కొండలు..!

- యథేచ్ఛగా ఎర్రమట్టి తరలింపు
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- చోద్యం చూస్తున్న అధికారులు



వి.కొత్తకోట వద్ద ఉన్న ఎదురు కొండలో ఎక్స్‌కవేటర్‌తో తవ్వకాలు

విడపనకల్లు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా కొండలను తవ్వేస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు. విడపనకల్లు మండలంలో కొందరు కాంట్రాక్టర్లు కొండలను తవ్వి ఎర్రమట్టిని తరలించి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. మండలంలో ఎర్రమట్టి కొండలు అధికంగా ఉన్నాయి. ఈ కొండల్లోని ఎర్రమట్టిని రోడ్లు, లేఅవుట్లకు వాడుతుంటారు. కర్ణాటక సరిహద్దులోని ఎర్రితాత కొండ, వి.కొత్తకోట సమీపంలో కొండలు ఉన్నాయి. వీటిలో ఎర్రమట్టిని కర్ణాటక రాష్ట్రంలోని రోడ్లకు తరలిస్తున్నారు. ఇక్కడి మట్టిని రాష్ట్ర సరిహద్దులు దాటించి సొమ్ము చేసుకుంటున్నారు. విడపనకల్లు మండలంలో వేసే రోడ్లకూ ఇదే మట్టిని తరలిస్తుంటారు. కాంట్రాక్టర్లు ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకపోయినా పట్టించుకునే నాథుడే లేడు. పట్టపగలే ఎర్రమట్టిని తరలిస్తున్నా చోద్యం చూస్తున్నారు. ఎకరాలకు ఎకరాలు కొండలను తవ్వేస్తున్నారు. సుమారు 20 అడుగుల



20 అడుగులకు పైగా తవ్విన కొండ

లోతు గుంతలు ఏర్పడ్డాయి. వి.కొత్తకోట రోడ్డుకు సుమారు మూడు కిలోమీటర్ల దూరం ఇరువైపులా ఎర్రమట్టిని వేశారు. అదే విధంగా చీకలగురికి రోడ్డుకు ఇరువైపులా ఎర్రమట్టిని తరలించారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల వద్ద ఉన్న రాష్ట్ర సరిహద్దులోని కొండను తవ్వి ఎర్రమట్టిని తరలించారు. ఇంత మట్టి దోపిడీ జరుగుతున్నా రెవెన్యూ, పంచాయతీ అధికారులు పట్టించుకోలేదు. కాంట్రాక్టర్లు ప్రభుత్వానికి ఎలాంటి రాయితీలు చెల్లించలేదు.



చీకలగురికి రోడ్డుకు ఇరువైపులా వేసిన మట్టి

దీంతో ప్రభుత్వానికి లక్షల రూపాయలు గండి కొడుతున్నారు.

అనుమతులు ఇవ్వలేదు

మట్టి తవ్వకాలకు రెవెన్యూ శాఖ నుంచి ఎవరికీ ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. ఎవరైనా కొండలను తవ్వి అక్రమంగా మట్టిని తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

- చంద్రశేఖర్‌రావు, డిప్యూటీ తహసీల్దార్

పెద్ద పంచాయితీ..!

- పంచాయతీల్లో నిలిచిన బిల్డింగ్ అప్రూవల్స్
- భారీగా తగ్గిన ఆదాయం

కార్మికులకు వేతనాలు చెల్లించలేని దుస్థితి

అహుడా కోసం పంచాయతీల నిర్వీర్యం అని విమర్శలు

ఇతర జిల్లాల్లో యథాతథంగా పంచాయతీ అప్రూవల్

అనంతపురం రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలకు నిధుల కొరత ఏర్పడింది. దీంతో పాలన తిరోగమనంలో పయనిస్తోంది. ఆర్థిక సంఘం నిధులు రాక పోవడం, పంచాయతీలకు వచ్చే ఆదాయాలు ఆగిపోవడంతో పాలన దిన దిన గండంగా సాగుతోంది. ముఖ్యంగా ఆన్‌లైన్ బిల్డింగ్ అప్రూవల్స్ నిలిచిపోవడంతో పంచాయతీల ఆదాయానికి గండి పడినట్లైంది. నిధులు కొరత వల్ల కొన్ని పంచాయతీల్లో పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించేందుకు వీలులేకుండా పోయింది. మరికొన్నింటిలో వీధిలైట్లు, బోర్లు ఇతరత్ర మరమ్మతులు చేయించలేని దుస్థితి ఏర్పడింది.

ఏడు నెలలుగా నిలిచిన బిల్డింగ్ అప్రూవల్స్

గ్రామ పంచాయతీల్లో ఏడు నెలల నుంచి బిల్డింగ్ అప్రూవల్స్ నిలిచిపోయాయి. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూలై 17 వరకు అక్రమ లేఅవుట్లను అరికట్టేందుకు అహుడా అధికారులు నిలిపివేశారు. ఆ తరువాత ఎల్‌ఆర్ఎస్ స్కీంను ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా జూలై నుంచే అక్టోబరు 23వతేదీ వరకు మరో మారు బిల్డింగ్ అప్రూవల్స్ నిలిపేశారు. అయితే ఎల్ఆర్ఎస్ స్కీంను వచ్చే ఏడాది జనవరి 23వరకు పొడిగించారు. ఈక్రమంలోనే పంచాయతీల ఆన్‌లైన్ బిల్డింగ్ అప్రూవల్స్‌ను సంబంధిత అధికారులు మళ్లీ బంద్ చేశారు. ఈ విధంగా ఇప్పటికే పంచాయతీల్లో బిల్డింగ్ అప్రూవల్స్ నిలిపేసి ఏడెనిమిది నెలలు కావస్తోంది. జనవరి వరకు ఇదేవిధంగా కొనసాగితే మరో రెండు నెలల పాటు పంచాయతీల్లో బిల్డింగ్ అప్రూవల్ ఇచ్చే పరిస్థితి ఉండదు. దీంతో పంచాయతీ వర్గాలు అహుడా అధికారుల పట్ల తీవ్ర స్థాయిలో మండిపడుతున్నాయి. పంచాయతీలకు వచ్చే ఆదాయానికి గండి కొట్టి అహుడా అధికారులు స్కీముల పేరిట అమలు చేయడం ఎంత వరకు సమంజసం అన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

అహుడాకు ఆదాయం.. పంచాయతీలకు గండి

పంచాయతీలో జరిగే బిల్డింగ్ అప్రూవల్స్ పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో బిల్డింగ్ అప్రూవల్స్ రూపంలో పంచాయితీలకు వచ్చే ఆదాయం పూర్తిగా ఆగిపోయింది. దీంతో పంచాయతీల్లో నిధుల కొరత ఏర్పడింది. ఇంటి పన్ను ద్వారా వచ్చే ఆదాయంతోనే పంచాయతీల్లో అన్ని పనులు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఆ నిధులు ఏమూలకు సరిపోవడం లేదన్న వాదనలు సంబంధిత వర్గాల నుంచి వ్యక్తం అవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో మాత్రమే అహుడా అధికారులు బిల్డింగ్ అప్రూవల్స్ నిలిపివేసి మరీ స్కీంలు అమలు చేస్తున్నట్లు తెలుస్తోంది. పక్క జిల్లాలో పంచాయతీల్లో బిల్డింగ్



రూరల్ పంచాయతీ కార్యాలయం ఎదుట పెండింగ్ వేతనాల కోసం ధర్నా చేస్తున్న కార్మికులు(ఫైల్)

అప్రూవల్ యథాతథంగా కొనసాగిస్తూనే ఎల్ఆర్ఎస్ అమలు చేస్తున్నారు. దీనివలన అప్రూవల్స్ కోసం పంచాయతీలకు వెళ్లేవారు వెళ్తుంటే, ఎల్ఆర్ఎస్ స్కీం ద్వారా దరఖాస్తు చేసుకునేవారు చేసుకుంటున్నారని చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలో మాత్రం ఇందుకు భిన్నంగా అహుడా అధికారులు వ్యవహరిస్తుండటం పట్ల పంచాయతీ వర్గాల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. అహుడా ఆదాయం కోసం పంచాయతీలకు వచ్చే ఆదాయాన్ని అడ్డుకోవడం సరైన నిర్ణయం కాదన్న వాదనలు వినిపిస్తున్నాయి.

చొరవ చూపితేనే..

గ్రామ పంచాయతీలకు అహుడా ద్వారా జరుగుతున్న నష్టంపై ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు చొరవ చూపాలన్న వాదనలు వినిపిస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితి కొనసాగితే పంచాయతీల్లో పని చేసేందుకు అధికారులున్నా..కార్మికులు, ఇతరత్ర వర్గాల వారు ముందుకు వచ్చే పరిస్థితి లేదంటున్నారు. ఇప్పటికే పంచాయతీల్లో పారిశుద్ధ్యం నిర్వహణకు కార్మికులు దొరకని పరిస్థితులు ఉన్నాయి. ఈనేపథ్యంలో ఉన్న వారికి వేతనాలు సక్రమంగా ఇవ్వకపోతే విధులు మానుకునే పరిస్థితులు ఉన్నాయంటూ సంబంధిత వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న స్థానిక ప్రజాప్రతినిధులు పంచాయతీల్లో చిన్న.. చిన్న పనులు చేయించేందుకు ముందుకు రావడంలేదని సమాచారం. ఇప్పటికే చేసిన పనులకు బిల్లులు మంజూరు కాకపోవడంతో ఇబ్బంది పడుతున్నట్లు తెలుస్తోంది. మరో రెండు మూడు నెలల్లో తమ పదవీ కాలం ముగుస్తుంది. ఈనేపథ్యంలో ఇప్పుడు సొంత డబ్బులు పెట్టి పనులు చేసి బిల్లుల కోసం ఇబ్బందులు పడటం ఎందుకన్న భావనలో వారు ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో సమస్యల భారమంతా పంచాయతీ కార్యదర్శులపై పడుతోంది. వారు నిధుల లేమితో అవస్థలు పడుతున్నారు.

దారులు దారుణం


ప్రమాదకరంగా వాహన ప్రయాణం.. మరమ్మతు చేయాలని ప్రజల వినతి

అనంతపురం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రధాన రహదారులు అధ్వానంగా మారాయి. ఆర్ అండ్ బీతోపాటు బెంగళూరు-హైదరాబాద్ 44వ నంబరు జాతీయ రహదారిపైనా గుంతలు పడ్డాయి. దీంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రభుత్వం నిధులను మంజూరు చేసి, వెంటనే మరమ్మతు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.



కంకర తేలిన గుత్తి - పత్తికొండ ప్రధాన రహదారి

- గుత్తి నుంచి పత్తికొండకు వెళ్లే ప్రధాన రహదారి పూర్తిస్థాయిలో దెబ్బతింది. కంకరతేలి గుంతలు పడటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రహదారిపై గోతులను పూడ్చేందుకు నిధులు మంజూరయ్యాయి. రూ.2 కోట్లతో గుంతల్లో డస్ట్ నింపి వదిలేశారు. దీంతో ప్రయాణికులు మరింత ఇబ్బంది పడుతున్నారు.
- అనంతపురం నుంచి గుత్తికి వెళ్లే 44వ నంబరు జాతీయ రహదారిపై పామిడి వద్ద పెన్నానది బ్రిడ్జిపై గుంతలు పడ్డాయి. వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. వైసీపీ హయాంలో రోడ్డు మరమ్మతులకు రూ.3.15 కోట్లు వెచ్చించారు. రెండేళ్లకే మరోమారు గుంతలు ఏర్పడ్డాయి.



బసినేపల్లి వద్ద దెబ్బతిన్న రోడ్డు



గార్లదిన్నె మండలం కల్లూరు, రామదాసు పేట, తలగాసిపల్లి సమీపంలో దెబ్బతిన్న 44వ జాతీయ రహదారి

- చెన్నేకొత్తపల్లి మండలంలోని ఎన్ఎస్‌గేటు నుంచి ధర్మవరం వెళ్లే ఆర్అండ్‌బీ ప్రధాన రోడ్డు గుంతలతో అధ్వానంగా మారింది. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దాదాపు 15 కి.మీ. పొడవున్న ఈ దారి చాలా వరకు దెబ్బతింది. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.
- చందమూరు, నాగసముద్రం గ్రామాల వద్ద రెండు ప్రధాన కల్వర్టులు కుంగిపోవడంతో ఈ ఏడాది జనవరిలో రూ.15లక్షలు వెచ్చించి నూతన కల్వర్టులు నిర్మించారు. ధర్మవరం నుంచి ఎన్ఎస్‌గేటు వరకు రోడ్డు దెబ్బతినడంతో రూ.15లక్షల నుంచి రూ.20లక్షలు వెచ్చించి అక్కడక్కడ ప్యాచ్ వర్క్‌లు చేశారు. కానీ మిగతా ప్రాంతాల్లో రోడ్డు బాగా దెబ్బతినడంతో ప్రయాణమంటే హడలిపోతున్నారు.

ప్రాణాలను కాపాడండి..



గార్లదిన్నె నుంచి కల్లూరు, రామదాసు పేట, గుడ్డాలపల్లి, తలగాసిపల్లి వెళ్లే హైవే రోడ్డుపై భారీ గుంతలు పడ్డాయి. రాత్రి వేళల్లో వెళ్లాలంటే భయంగా ఉంది. ఇప్పటికే చాలా మంది చనిపోయారు. ఎంతోమంది కిందపడి కాళ్లు, చేతులు విరగ్గొట్టుకున్నారు. వెంటనే ప్రభుత్వం, అధికారులు స్పందించి హైవేను బాగు చేయాలి.

- బజారప్ప, గార్లదిన్నె

సాయిప్రేమ విశ్వవ్యాప్తం

(5వ పేజీ తరువాయి)

తన జీవితంలో ఎన్నో మార్పులు చోటు చేసుకున్నాయని అన్నారు. సత్యసాయితో ఉన్న అనుబంధం జీవితాంతం తన వెంట ఉంటుందని అన్నారు. సత్యసాయి ప్రేమ, సేవా మార్గం తమకు శిరోధార్యమని, వాటిని విశ్వవ్యాప్తం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సభ్యుడు డాక్టర్ మోహన్ అన్నారు. సత్యసాయి ప్రేమతత్వం, సేవలతో సేవాదళ్ సభ్యులు తమ జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకుంటున్నారని సత్యసాయి సేవా సంస్థల జాతీయ అధ్యక్షుడు నిమీష్ పాండే అన్నారు. మహిమను కరుణను గుర్తించినప్పుడే నిజమైన భక్తి పుడుతుందని సరితా అయ్యర్ అన్నారు. పరిపూర్ణ సమర్పన, నిర్మలమైన చరణాగతితో మనం ఏ కార్యక్రమం చేసినా భగవంతుడు మన వెంటే ఉంటారని అన్నారు.

ప్రశాంతి నిలయంలో సందడి

సత్యసాయి శత జయంతి ఉత్సవాలకు వచ్చి భక్తులతో ప్రశాంతి నిలయం సందడిగా మారింది. సాయికుల్వంతు మందిరం భక్తులతో కిటకిటలాడింది. వేలాది మంది సత్యసాయి మహా సమాధిని దర్శించుకున్నారు. అంతర్జాతీయ సదస్సుకు వివిధ దేశాల నుంచి 2500 మంది సేవాదళ్ ప్రతినిధులు హాజరయ్యారు. ప్రశాంతి నిలయంలో సత్యసాయి యువత సంగీత, గాన కచేరీతో భక్తులను అలరించింది. వేడుకలకు హాజరైన భక్తులకు ట్రస్టు ఆధ్వర్యంలో నారాయణసేవను అందించారు. ప్రశాంతి నిలయం వెస్ట్‌గేట్, ఎనుములపల్లి గణేశ్ సర్కిల్ గేటు సమీపంలో భక్తులకు మూడు పూటలా నారాయణ సేవను అందిస్తున్నారు. వేడుకలకు రాజ్యసభ సభ్యుడు భగవత్ ఖరాడ్, సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్, సభ్యులు చక్రవర్తి, ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి, మాజీ మంత్రులు గీతారెడ్డి, పల్లె రఘునాథరెడ్డి తదితరులు హాజరయ్యారు.


మహాసమాధి వద్ద ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి


సదస్సుకు హాజరైన మహిళలు



అంతర్జాతీయ సదస్సులో వివిధ దేశాల సేవాదళ్ ప్రతినిధులు

సత్యసాయి ప్రేమతత్వ ప్రచారమే ఆశయం

● సేవా సంస్థల జాతీయ కో ఆర్డినేటర్ కోటేశ్వరరావు


ప్రసంగిస్తున్న కోటేశ్వరరావు

పుట్టపర్తి: ప్రేమ, సేవ, బోధనలతో సత్యసాయి ప్రపంచానికి ఆధ్యాత్మిక గురువుగా పూజలందుకుంటున్నారని సత్యసాయి సేవా సంస్థల జాతీయ కో ఆర్డినేటర్ కోటేశ్వరరావు అన్నారు. సత్యసాయి ప్రేమ తత్వాన్ని ప్రచారం చేయడమే తమ జీవితాశయమని అన్నారు. సాయి కుల్వంతు హాలులో శుక్రవారం రాత్రి జరిగిన అంతర్జాతీయ సదస్సులో ఆయన ప్రసంగించారు. సత్యసాయి బాబా 1962, నవంబరు 24 న మొదటి సారి ప్రపంచ సదస్సును ప్రారంభించారని గుర్తు చేశారు. నాటి నుంచి సదస్సులను కొనసాగిస్తున్నామని తెలిపారు. సత్యసాయి భక్తులు నాయకత్వ లక్షణాలను పెంచుకోవాలని, త్రికరణ శుద్ధితో సేవ చేయాలని సూచించారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రజలకు ప్రేమను చేరవేయడంలో పదేళ్లలో ఎంతో ముందుకు వెళ్లామని అన్నారు. భవిష్యత్తులో బాలవికాస్ విద్యను అభివృద్ధి చేయాలని, గురువులకు శిక్షణ ఇవ్వాలని, మహిళా సదస్సులు నిర్వహించాలని పిలుపునిచ్చారు. అనంతరం మహారాష్ట్రకు చెందిన రాహల్ దేశ్ పాండే బృందం సంగీత, గాన కచేరీ నిర్వహించింది.

వంద మందికి ఆటోలు

కేరళ సేవా సంస్థలు 'శ్రీసత్యసాయి జీవనోపాధి' పేరిట వంద మందికి ఆటో రిక్షాలను సమకూర్చాయి. వీటిని లబ్ధిదారులకు మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ శుక్రవారం అందజేశారు.


సంగీత కచేరీ నిర్వహిస్తున్న రాహుల్ దేశ్ పాండే బృందం


ఆటోలు అందుకున్న కేరళ లబ్ధిదారులతో ట్రస్టు సభ్యులు

నేడు పుట్టపర్తికి రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి



పోలీసులకు సూచనలు ఇస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్, వేదికపై డీఐజీ షిమోషి, బందోబస్తు నిమిత్తం పుట్టపర్తికి వచ్చిన పోలీసు అధికారులు

(5వ పేజీ తరువాయి)

రోజులపాటు పుట్టపర్తిలో ఉండి, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతితో కలిసి వేడుకలలో పాల్గొంటారు. ఈ నేపథ్యంలో భద్రతపై డీఐజీ షిమోషి, ఎస్పీ సతీష్ కుమార్ సమీక్ష నిర్వహించారు. ఆయా సెక్టార్ ఇన్‌చార్జిలకు దిశానిర్దేశం చేశారు. సత్యసాయి విమానాశ్రయం, కాన్వాయ్ వెళ్లే రోడ్డు మార్గం, పార్కింగ్ ప్రదేశాలు, రూట్ డైవర్షన్స్ గురించి సూచనలు చేశారు.

నేడు మంత్రి నారా లోకేశ్ రాక

ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ శనివారం పుట్టపర్తి వస్తున్నారు. ఉండవల్లిలోని తన నివాసం హెలికాప్టర్‌లో బయలుదేరి ఉదయం 9.45 గంటలకు ఆయన పుట్టపర్తి విమానాశ్రయం చేరుకుంటారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సీఎం చంద్రబాబుతో కలిసి స్వాగతం పలుకుతారు. అనంతరం ప్రశాంతి నిలయం చేరుకుని, వేడుకలలో పాల్గొంటారు. మ ధ్యాహ్నం రాష్ట్రపతికి వీడ్కోలు పలుకుతారు. పుట్టపర్తి విమానాశ్రయంలో ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌కు సాయంత్రం 3.30 గంటలకు స్వాగతం పలుకుతారు. ఆయనతోకలిసి సత్యసాయి వర్సిటీ స్నాతకోత్సవంలో పాల్గొంటారు. కప్పలబండ పారిశ్రామికవాడలో ఏర్పాటు చేసిన ప్రత్యేక టెంట్ హౌస్‌లో శనివారం రాత్రి బస చేస్తారు. సత్యసాయి శతజయంతి వేడుకల్లో ఆదివారం పాల్గొంటారు. గోరంట్ల మండలం పాలసముద్రం వద్ద గల నాసిన్ క్యాంపులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మధ్యాహ్నం పాల్గొంటారు. అనంతరం పుట్టపర్తి విమానాశ్రయం చేరుకుని హైదరాబాద్ వెళ్తారు.

ప్రేమ జ్యోతి పుస్తకావిష్కరణ

శ్రీసత్యసాయి ప్రేమ జ్యోతి పుస్తకాన్ని 11వ అంతర్జాతీయ సదస్సు ముగింపు సందర్భంగా శుక్రవారం రాత్రి సాయి కుల్వంతు మందిరంలో ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి సదస్సును ముగించారు. సత్యసాయి ప్రేమ తత్వాన్ని మరింత విశ్వవ్యాప్తం చేయాలని, సేవాదళ్‌లో మహిళ విభాగాన్ని మరింతి బలోపేతం చేయాలి తీర్మానించారు.


ప్రేమజ్యోతి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ట్రస్టు, సేవాదళ్ ప్రతినిధులు

తెలుగు సాహిత్యానికి పద్యమే మూలం

● ఇంటాక్ కన్వీనర్ రామ్‌కుమార్

అనంతపురం టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్యానికి పద్యమే మూలమని ఇంటాక్ అనంతపురం జిల్లా కన్వీనర్ రామ్‌కుమార్ పేర్కొన్నారు. ప్రపంచ వారసత్వ వారోత్సవాల్లో భాగంగా మూడో రోజు శుక్రవారం జిల్లా కేంద్రంలోని పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు పురావస్తు ప్రదర్శనశాలలో వివిధ పాఠశాలల విద్యార్థులకు పద్యపఠన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పురాణ ఇతిహాసాల నుంచి నేర్చుకున్న పద్యాలు, చందస్సు, యతి, ప్రాసతో కూడిన పద్యాలు, సాహితీ పద్యాలు, వేమన పద్యాలు, సుభాషితాలు పఠించారు. అనంతరం పురావస్తుశాఖ ఏడీ స్వామినాయక్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రామ్‌కుమార్ మాట్లాడుతూ పద్యంతో భావ వ్యక్తీకరణ చేయడం ద్వారా భాషా సామర్థ్యం పెరుగుతుందన్నారు. వారసత్వమంటే కేవలం కట్టడాలు మాత్రమే కాదని, భాష కూడా అని పేర్కొన్నారు. భాష ఒక సజీవ నదీ ప్రవాహంలాంటిదన్నారు. ఒక తరం నుంచి మరో తరానికి వారసత్వంలాగే భాష కూడా ప్రవహిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ మాతృభాషను కాపాడుకోవాలన్నారు. జిల్లా పురావస్తుశాఖ ఏడీ స్వామినాయక్ మాట్లాడుతూ తెలుగు భాషకు పద్యాలు ప్రాణం లాంటివని, చిన్నపుడు అమ్మ పాడే జోలపాటలతోనే మనకు తెలుగు భాష పద్యాలతో అనుబంధం ఏర్పడుతుందన్నారు. విద్యార్థి దశలో పద్యాలను గురించి తెలుసుకుంటామన్నారు. తెలుగు భాషా మాధుర్యం పద్యాలలోనే ఉందని చాటి చెప్పిన గొప్ప తెలుగు కవుల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇంటాక్ సభ్యులు షేక్ రియాజుద్దీన్ అహ్మద్, డాక్టర్ జూటూరు షరీఫ్, సిగిలిరేవు రామాంజనేయులు, టీవీ రెడ్డి, సీనియర్ రచయిత డాక్టర్ పతికి రమేష్ నారాయణ, కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి, గిరిధర ప్రసాద్‌రాయ్, యాడికి సూర్యనారాయణరెడ్డి, ఒంటెద్దు రామలింగారెడ్డి, అశోకవర్ధన్‌రెడ్డి, పిడతల కృష్ణమూర్తి, విద్యార్థులు, పురావస్తుశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇంటాక్ కన్వీనర్ రామ్‌కుమార్


వంద కిలోల కేక్‌తో ట్రస్టు ప్రతినిధులు, మంత్రి కందుల దుర్గేష్

మహనీయుడు సత్యసాయి

పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్

ప్రశాంతి నిలయంలో వంద కిలోల కేక్ కట్ చేసిన మంత్రి

పుట్టపర్తి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సామాజిక సేవకు, మానవ సంక్షేమానికి ఆధ్యాత్మికతను సాధనంగా మలిచిన మహనీయుడు సత్యసాయి బాబా అని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ కొనియాడారు. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో సెంట్రల్ ట్రస్ట్ నిర్వాహకులతో కలిసి వంద కిలోల సత్యసాయి బాబా పుట్టిన రోజు కేకును మంత్రి శుక్రవారం కట్ చేశారు. సత్యసాయి ఆశీస్సులు అందరిపై ఉండాలని మంత్రి ఆకాంక్షించారు. సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్, సభ్యులు నాగానందం, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతల ఆనందం

ఖాతాల్లో జమైన అన్నదాత సుఖీభవ డబ్బులు

సొమ్ము కోసం బ్యాంకులకు క్యూ కట్టిన రైతులు


కణేకల్లులో రైతులతో కిటకిటలాడుతున్న ఏపీజీ బ్యాంకు

కణేకల్లు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ సొమ్ము బ్యాంకు ఖాతాల్లో జమ కావడంతో రైతుల ముఖాల్లో ఆనందం కనిపిస్తోంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల బ్యాంకు ఖాతాలకు గత బుధవారం రూ.7వేలు జమ చేశాయి. దీంతో ఆ డబ్బు డ్రా చేసుకోవడానికి రైతులు బ్యాంకులకు క్యూ కడుతున్నారు. మండలంలో 9414 మంది రైతులకు రూ.6.58 కోట్ల డబ్బులు మంజూరయ్యాయి. వీటిని డ్రా చేసుకోవడానికి మండల కేంద్రంలోని స్టేట్‌బ్యాంక్, యూనియన్ బ్యాంక్, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్‌లకు రైతులు రెండు రోజుల నుంచి క్యూ కడుతున్నారు. దీంతో ఆయా బ్యాంకులు కిటకిటలాడుతున్నాయి.

రెండోసారి తీసుకుంటున్నా



నేను రెండోసారి అన్నదాత సుఖీభవ డబ్బులు తీసుకుంటున్నా. ఇంతకు ముందే ఒకసారి రూ. ఏడు వేలు సొమ్ము అందుకున్నా. రెండోసారి డబ్బులు జమ కావడంతో తీసుకునేందుకు వచ్చా. ఎన్నికల హామీ మేరకు ప్రభుత్వం మాటను నిలబెట్టుకోవడం అభినందనీయం.

- జయరామిరెడ్డి, రైతు, నల్లంపల్లి

19వ తేదీనే జమ



అన్నదాత సుఖీభవ కింద 19వ తేదీ మధ్యాహ్నానికే మా ఖాతాకు రూ. ఏడువేలు జమ అయ్యాయి. వ్యవసాయ పనులు చేసుకునే రైతులకు ఈ సొమ్ము ఎంతో ఉపయోగకరంగా ఉంది. భవిష్యత్‌లో కూడా ఇలాగే రైతులకు సొమ్ము అందిస్తూ ఆసరాగా ఉండాలి.

- రామన్న, రైతు, ఉడేగోళం

ఆధార్ కేంద్రాల్లో అనర్హులు..!

కనీస పరిజ్ఞానంలేని పలువురు ఆపరేటర్లు.. అప్‌డేట్లలో విఫలం

బ్లాక్ అవుతున్న కార్డులు

దరఖాస్తుదారులకు తప్పని తిప్పలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆధార్‌లో మార్పులు, చేర్పులు చేసుకోవడం పెనుకష్టంగా మారింది. గంటలు, రోజులు పడిగాపులు కాయాల్సిందే. అన్ని వ్యయప్రయాసలకు ఓర్చి.. మార్పుచేర్పులకు దరఖాస్తు చేసుకుంటే.. 'హమ్మయ్య.. పెద్ద సమస్య తీరింది..' అని ఊపిరి పీల్చుకుంటుంటారు జనం. మార్పుచేర్పులతో కార్డు వస్తుందని ఎదురుచూస్తుంటారు. ఆ సమయంలో కార్డు అప్‌డేషన్ విఫలమైందంటూ మెసేజ్ వస్తుంది. దీంతో జనం బిక్కమొహం వేస్తున్నారు. మళ్లీ దరఖాస్తు చేసుకోవాలంటే బెంబేలెత్తిపోతున్నారు. అయినా.. తప్పనిసరి పరిస్థితుల్లో దరఖాస్తు చేసుకుంటున్నారు. పదేపదే రిజెక్ట్ అవుతూ.. ఆఖరుకు కార్డే బ్లాక్ అవుతోంది. దీంతో దరఖాస్తుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇందుకు సాంకేతిక సమస్యలే కారణమని ఆధార్ సెంటర్ ఆపరేటర్లు చెబుతుంటారు. వారి అవగాహనలేమి కూడా కారణమని తెలుస్తోంది. జిల్లాలోని ఆధార్ సెంటర్లలో ఆపరేటర్లుగా పనిచేస్తున్న వారిలో చాలా మందికి అర్హతలేదని సమాచారం. కనీస అవగాహనలేని వారు ఆధార్ అప్‌డేట్ చేయలేకపోతున్నారు. వారి వైఫల్యాన్ని సాంకేతిక సమస్య అని చెప్పి.. దరఖాస్తుదారులను మభ్య పెడుతున్నారు.

పట్టించుకోని అధికారులు

జిల్లాలో నిర్వహిస్తున్న ఆధార్ సెంటర్లలోని ఆపరేటర్లు అర్హతగలిగిన వారేనా అంటే... కాదనే వాదనలు వినిపిస్తున్నాయి. పరీక్షలు రాయకుండానే... సంబంధిత ఏజెన్సీల అనుమతులు లేకుండానే విచ్చలవిడిగా ఆధార్ సెంటర్లను పలువురు ఆపరేటర్లు నడుపుతున్నట్లు తెలుస్తోంది. ఫలితంగా ఏమీ తెలియని ప్రజలు ఆధార్ అప్‌డేట్లలో సమస్యలు ఎదుర్కొంటున్నారనే చెప్పాలి. జిల్లాలో పలువురు ఆధార్ ఆపరేటర్ల అవతారమెత్తి సెంటర్లు నిర్వహిస్తున్నారన్న వాదనలు వినిపిస్తున్నా యి. వీటిని పర్యవేక్షించాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.


ఆధార్ సెంటర్ వద్ద ప్రజలు (ఫైల్)

పరీక్షల్లో ఉత్తీర్ణత తప్పనిసరి..

ఆధార్ సెంటర్‌లో ఆపరేటర్‌గా వ్యవహరించాలంటే తప్పనిసరిగా ఆధార్‌కు సంబంధించిన పరీక్షలు రాయాలని ఉడాయ్ నిబంధనలు చెబుతున్నాయి. ఎల్ఎంఎస్, ఆధార్ పరీక్షలు ఆన్‌లైన్‌లో రాయాల్సి ఉంటుంది. ఈ పరీక్షల్లో ఆధార్ సిస్టమ్ లాగిన్ ఎలా అవ్వాలి..? కార్డు అప్‌డేట్, పేర్ల మార్పులు, పుట్టిన తేదీ ఎలా మార్పు చేయాలి..? ఏయే అప్‌డేట్లకు ఎలాంటి ధృవపత్రాలను.. ఎలా అప్‌లోడ్ చేయాలి...? పెనాల్టీ..? తదితర అంశాలపై ఆన్‌లైన్ ద్వారా పరీక్షలు రాయాల్సి ఉంటుంది. ఉత్తీర్ణులైన ఆపరేటర్లకు ఉడాయ్ ఆన్‌లైన్ ద్వారా సర్టిఫికెట్ అందజేస్తుంది.

ఏజెన్సీ అనుమతితోనే...

ఉడాయ్ సర్టిఫికెట్ పొందినవారు.. ఆధార్ సెంటర్లు నిర్వహిస్తున్న ఏజెన్సీ ద్వారా అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఆ పత్రం ఆధారంగానే కేటాయించిన ఆధార్ సెంటర్‌లో పని చేయాల్సి ఉంటుంది. కొందరు ఆపరేటర్లు ఇలాంటి అనుమతులు లేకుండానే నెట్‌సెంటర్లలో ఆధార్ అప్‌డేట్లు చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఎవరు పర్యవేక్షిస్తారో.. ఏమో..

జిల్లాలో ఆధార్ సెంటర్లను ఏ అధికారి పర్యవేక్షిస్తారో అర్థంకాని గందరగోళ పరిస్థితి నెలకొంది. తపాలాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆధార్ సెంటర్లకు పూర్తి బాధ్యత ఆ శాఖ సూపరింటెండెంట్‌దే. సచివాలయాల్లో నిర్వహించే సెంటర్లు.. కలెక్టర్, జేసీ పరిధిలో ఉంటాయి. ప్రైవేటు బ్యాంకులు, నెట్ సెంటర్లు, మీ-సేవ కేంద్రాల్లో నిర్వహించే ఆధార్ సెంటర్లు ఆయా సంస్థల పరిధిలో ఉంటాయి. వాటిని ఎవరు పర్యవేక్షిస్తారన్నది అంతుచిక్కడం లేదనే చెప్పాలి. ఈ నేపథ్యంలో పలువురు సెంటర్ల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా ఆధార్ అప్‌డేట్లు చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆధార్ అప్‌డేట్లలో సమస్యలు

అవగాహనలేని ఆపరేటర్లతో ఆధార్ అప్‌డేట్ చేయడంలో సమస్యలు ఉత్పన్నమవుతున్నట్లు సమాచారం. అప్‌డేట్ చేసే సమయంలో సరైన పత్రాలు అప్‌లోడ్ చేయకపోవడం, సెంటర్లకు వచ్చిన ప్రజలకు ఏయే ధృవపత్రాలు కావాలో చెప్పలేకపోవడంతో పలుమార్లు ఆధార్ అప్‌డేట్లు రిజెక్ట్ అవుతున్నట్లు తెలుస్తోంది. పేరు, పుట్టిన తేదీ మార్పుల్లో చాలామంది కార్డుదారులు స్పష్టతలేక బ్లాక్ చేసుకున్నట్లు తెలుస్తోంది. కనీసం ఏయే ధృవపత్రాలు సమర్పించాలన్న విషయాన్ని చెప్పలేని కొందరు సెంటర్లు నడుపుతుండటం విమర్శలకు తావిస్తోంది.

టమోటా కిలో రూ.52

అనంతపురం రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్లో శుక్రవారం టమోటాలు కిలో గరిష్ఠంగా రూ.52తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.30తో, సరసరిగా రూ.37తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 1950 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

చీనీ టన్ను రూ.18 వేలు

అనంతపురం రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): అనంత వ్యవసాయ మార్కెట్లో శుక్రవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.18వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.9 వేలు, సరాసరి ధర రూ.12వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 18టన్నుల చీనీకాయలు వచ్చినట్లు చెప్పారు.

ఇన్సాఫ్ రాష్ట్ర కార్యదర్శిగా జాఫర్


జాఫర్


ఖాజాహుస్సేన్

అనంతపురం విద్య, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సీపీఐ మైనార్టీ విభాగం ఇన్సాఫ్ రాష్ట్రకార్యదర్శిగా సీనియర్ నాయకుడు జాఫర్‌ను నియమించారు. ఇన్సాఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఖాజాహుస్సేన్‌కు అవకాశం కల్పించారు. శుక్రవారం విజయవాడలో ఆల్ ఇండియా తంజీమ్-ఏ-ఇన్సాఫ్‌రాష్ట్ర ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జులఈశ్వరయ్య సమక్షంలో వీరిని ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.

ఉపాధి అక్రమాలకు చెక్ పడేనా..?

ఈకేవైసీతో 50వేలకుపైగా కూలీల తొలగింపు

5,26,534 మందికిగాను..

4,12,361 మందితో ఐరిష్ సేకరణ

నేడు గ్రామ సభలు.. అభ్యంతరాల స్వీకరణ

అనంతపురం అర్బన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు అంతేలేదు. ఎప్పటికప్పుడు ప్రభుత్వం కొత్త నిబంధనలు అమలు చేస్తున్నా లొసుగులను అడ్డం పెట్టుకుని కొందరు ఆయాచితంగా లబ్ధిపొందుతున్నారు. ప్రస్తుతం తీసుకు వచ్చిన నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ (ఎన్ఎంఎంఎస్) విధానం అమలుతోనయినా ఉపాధి అక్రమాలకు చెక్ పడేనా..? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అక్రమాలను నిరోధించేందుకు కేంద్ర ప్రభుత్వం ఉపాధి కూలీలతో ఈకేవైసీ చేయిస్తోంది. అక్టోబరు నుంచి ఉపాధి కూలీలతో ఈకేవైసీ చేయడం మొదలు పెట్టారు. ఈ విధానంలో ఉపాధి కూలీల ఐరిస్ ఫొటో తీసుకొని యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. తొలుత అక్టోబరు నెలాఖరులోగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. నవంబరు నుంచి ఈకేవైసీ చేయించుకున్న కూలీలకు మాత్రమే వేతనాలు మంజూరు చేయాలని నిర్ణయించారు. క్షేత్ర స్థాయిలో ఆశించిన మేరకు ఈకేవైసీ పూర్తి చేయకపోవడంతో గడువును పొడిగించారు. అయినప్పటికీ పలు గ్రామ పంచాయతీల్లో పెండింగ్‌లోని కూలీలతో ఈకేవైసీ చేయించడంలో సిబ్బంది జాప్యం చేస్తుండటం గమనార్హం. జిల్లా వ్యాప్తంగా 5,26,534 మంది ఉపాధి కూలీలు ఉన్నట్లు జాబితాలో చేర్చారు. ఇందులో ఇప్పటి దాకా 4,12,361 మందితో (78.35 శాతం) ఐరిస్ సేకరణ పూర్తి చేశారు. ఇంకా 1.14 లక్షల మంది పెండింగ్ జాబితాలో ఉన్నారు.

బయటపడుతున్న బోగస్ కార్డులు

ఉపాధి కూలీలతో ఈకేవైసీ ప్రక్రియలో బోగస్ జాబ్ కార్డులు, కూలీలు బయటపడుతున్నట్లు సమాచారం. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి దాకా 50వేల మందికిపైగా కూలీల పేర్లను తొలగించినట్లు తెలిసింది. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు ఆ శాఖ వర్గాల ద్వారా అందిన సమాచారం. ఈ నేపథ్యంలో తమకు అనుకూలమైన వారి పేర్లను అలాగే ఉంచేందుకు పలు మండలాల్లోని అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకుల నుంచి డ్వామా అధికారులు, సిబ్బందిపై ఒత్తిడి పెరిగినట్లు తెలుస్తోంది. ఈకేవైసీ ప్రక్రియ పూర్తి చేయడంలో పలు ప్రాంతాల్లో జాప్యానికి రాజకీయ నేతల నుంచి సిబ్బందికి ఒత్తిళ్లే కారణమన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు పలువురు కూలీలు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లారు. అలాంటి కూలీలకు సమాచారం అందించి, ఈకేవైసీ చేయించడంలో పలు ప్రాంతాల్లోని అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.



శింగనమల మండలంలో ఉపాధి కూలీకి ఈకేవైసీ చేస్తున్న సిబ్బంది

నేడు పంచాయతీల్లో గ్రామ సభలు

జిల్లా వ్యాప్తంగా శనివారం అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈకేవైసీ ప్రక్రియలో తొలగించిన వారిలో నిజమైన కూలీలు ఉంటే గ్రామ సభల్లో అర్జీలు సమర్పించుకునేందుకు అవకాశం కల్పించారు. కొత్త జాబ్ కార్డులు, ఉపాధి పనుల కోసం కూడా దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఈ మేరకు డ్వామా అధికారులు, సిబ్బంది గ్రామ సభలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. గ్రామ సభల్లో ఈకేవైసీ వివరాలు ప్రదర్శించి, అభ్యంతరాలు స్వీకరించనున్నారు. ఈకేవైసీ ప్రక్రియలో భాగంగా తొలగించిన జాబితాలో నిజమైన కూలీలు ఉంటే తిరిగి జాబితాలో చేర్చేందుకు చర్యలు తీసుకుంటారు. సందట్లో సడేమియా అన్న చందంగా కొందరు రాజకీయ నాయకులు ఉపాధి పనులకు వెళ్లకుండా ఇదివరకు డబ్బులు కాజేసిన తమకు అనుకూలమైన వారి పేర్లను జాబితాలో తిరిగి ఎక్కించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో ఈకేవైసీ ప్రక్రియ వంద శాతం సవ్యంగా సాగుతుందో..? లేదోనన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

గ్రామ సభలను సద్వినియోగం చేసుకోండి

జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో శనివారం గ్రామ సభలు నిర్వహిస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయిలో అధికారులు, సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం. ఈకేవైసీ ప్రక్రియలో తొలగించిన జాబితాపై అభ్యంతరాలను స్వీకరిస్తాం. అలాగే కొత్తగా జాబ్ కార్డులు, ఉపాధి పనుల కల్పన కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ అవకాశాన్ని ఉపాధి కూలీలు సద్వినియోగం చేసుకోవాలి. ఈకేవైసీ ప్రక్రియ పూర్తయిన తర్వాత.. ఉపాధి పనులకు హాజరయ్యే కూలీలతో వ్యక్తిగతంగా ఫొటో తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. తద్వారా ఉపాధి పనుల్లో అక్రమాలను అరికట్టవచ్చు.

- సలీం బాషా, డ్వామా పీడీ

గంజాయి కేసులో ఐదుగురికి పదేళ్ల జైలు

రూ.లక్ష చొప్పున జరిమానా

అనంతపురం క్రైం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గంజాయి సరఫరా, విక్రయానికి సంబంధించిన కేసులో ఐదుగురు ముద్దాయిలకు 10 ఏళ్ల జైలు శిక్ష, రూ. లక్ష జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. ఈ మేరకు శుక్రవారం అనంతపురం జిల్లా మొదటి అదనపు సెషన్స్ కోర్టు న్యాయాధికారి సత్యవాణి తీర్పు వెలువరించారు. ఆరుగురు ముద్దాయిలకు శిక్ష విధించగా.. ఏ6 ముద్దాయి ఇప్పటికే మరణించాడు. వివరాల్లోకి వెళితే.. అనంతపురం రూరల్ మండలం రుద్రంపేటకు చెందిన గంగాధర్ (36), స్వాతి(34) ఇంట్లో 2020 జూలై 18న స్పెషల్ డ్యూటీ ఆఫీసర్, సెబ్ సీఐ మారుతీరావు, 4వ పట్టణ సీఐ శ్రీనివాసులు తనిఖీలు చేశారు. వారి వద్ద 30 కిలోల గంజాయి దొరకడంతో సీజ్ చేశారు. అదేవిధంగా తాటిచెర్లకు చెందిన మేకల ప్రసాద్(40) వద్ద 10 కిలోలు, పొట్టి శ్రీరాములు కాలనీకి చెందిన షేక్ గౌసియా(44) వద్ద 10 కిలోలు, గుంతకల్లు మండలం తిమ్మాపురానికి షేక్ హాజీవలి(28) వద్ద రెండున్నర కిలోలు గంజాయి దొరకడంతో కేసులు నమోదు చేశారు. కేసు విచారణ తర్వాత సీఐ ప్రతాప్ ఎరెడ్డి జిల్లా మొదటి అదనపు సెషన్స్ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసును న్యాయాధికారి సత్యవాణి విచారణ చేశారు. ఐదుగురు ముద్దాయిలు నేరం చేసినట్టు రుజువు కావడంతో.. గంగాధర్, స్వాతి, ప్రసాద్, షేక్ గౌసియా, షేక్ హాజీవలికి 10 ఏళ్ల జైలు శిక్ష విధించారు. అదేవిధంగా ముద్దాయిలకు తలా రూ. లక్ష జరిమాన కూడా విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ కేసులో 6వ ముద్దాయిగా ఉన్న అనంతపురంలోని భైరవనగర్‌కు చెందిన అడవాల చంద్రశేఖర్(30) మరణించాడు.

లక్షణంగా కొట్టేశాడు

లింక్‌తో వీఆర్ఓను బురిడీ కొట్టించిన ఆర్ఐ

రూ.1.19లక్షలు స్వాహా



నగదు డెబిట్ అయిన స్ర్కీన్‌షాట్

పెనుకొండ టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): తన డిపార్ట్‌మెంట్ ఉద్యోగి పంపిన లింక్‌ను ఓపెన్ చేసిన ఓ వీఆర్ఓ రూ.1.19 లక్షలు పోగొట్టుకున్న సంఘటన పెనుకొండలో ఆలస్యంగా వెలుగుచూసింది. బాధితురాలైన వీఆర్ఓ యశస్విని తెలిపిన మేరకు.. పెనుకొండలో ఆర్ఐగా పని చేసి బదిలీపై వెళ్లిపోయిన పురుషోత్తం నంబర్ నుంచి తనకు వాట్సాప్ ద్వారా ఆర్టీఓ ట్రాఫిక్ చలానా అనే యాప్‌లింక్ బుధవారం వచ్చిందన్నారు. ఏంటి ఇది అని అతడికి మెసేజ్ పెట్టగా, ఓపెన్ చేయమని సమాధానం వచ్చిందన్నారు. దీంతో ఒకే డిపార్ట్‌మెంట్ కదా అనుమానించడానికే ముందని, రెవెన్యూ సేవలకు అవసరం అవుతుందేమోననే నమ్మకంతో ఆ లింక్ ఓపెన్ చేసినట్లు తెలిపారు. ఇంతలో తన అకౌంట్‌లో ఉన్న రూ.1.19లక్షలు డెబిట్ అయినట్లు మెసేజ్ రావడంతో ఆందోళనతో బ్యాంక్ బాలెన్స్ చెక్‌చేస్తే నగదు కనిపించలేదని తెలిపారు. దీంతో పుట్టపర్తి సైబర్ క్రైం కార్యాలయంలో గురువారం ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు.

యువకుడి ఆత్మహత్య



వంశీ (ఫైల్)

తాడిపత్రి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోమలి-జూటూరు సమీపంలో వంశీ (21) శుక్రవారం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ వరప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన మేరకు పెద్దపప్పూరు మండలం తబ్జుల గ్రామానికి చెందిన రామాంజనేయులు, నాగమ్మ దంపతుల కుమారుడు వంశీ చిత్తూరు జిల్లా ఎస్వీసెట్ కాలేజీలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతూ అర్ధాంతరంగా వదిలేశాడు. ఇంటికి వచ్చి ఖాళీగా ఉండేవాడు. చదువు అబ్బడం లేదని, ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నానని తరచూ తన స్నేహితులతో చెప్పేవాడు. భవిష్యత్తుపై బెంగతోనే దిక్కుతోచక ఆత్మహత్య చేసుకున్నాడని రైల్వే పోలీసులు తెలిపారు. తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పనులు వేగంగా పూర్తి చేయాలి

పీఆర్ ఎస్ఈ చిన్న సుబ్బరాయుడు

అనంతపురం న్యూటౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పీఐయూ (ప్రాజెక్టు ఇంప్లిమెంటేషన్ యూనిట్) ద్వారా చేపట్టే అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లకు పీఆర్ ఎస్ఈ చిన్న సుబ్బరాయుడు ఆదేశించారు. పంచాయతీరాజ్ ఎస్ఈ కార్యాలయంలో శుక్రవారం ఆయన ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ సమావేశం నిర్వహించారు. అందులో భాగంగా ఏపీఆర్ఆర్‌పీ ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులు వేగంగా జరిగేలా చూడాలని సూచించారు. మిగిలిన స్కీమ్స్ ద్వారా జరుగుతున్న పనులు మార్చిలోపు పూర్తి అయ్యేలా చూడాలన్నారు. కాంట్రాక్టర్లకు ఫీల్డ్‌లో ఏదైనా సమస్య ఉంటే వాటికి తగిన పరిష్కారమార్గాలు చూపాలని పేర్కొన్నారు. సమావేశంలో ఈఈలు శ్రీరాములు, శంకరయ్య, పీఏ టూ ఎస్ఈ రాజేంద్రప్రసాద్, డీఈలు తిరుమలరెడ్డి, నారాయణస్వామి, సుధాకర్ నాయక్, నాగేంద్రకుమార్, మధన్‌మోహన్, మురళీధర్, వెంకటేష్, హనుమంతయ్య శెట్టి, ఏఈఈలు రజినీకాంతరెడ్డి, పాండురంగారెడ్డి, సూర్యశేఖర్, మల్లికార్జున, రాజేంద్రప్రసాద్, నళిని, ప్రసాద్, రామాంజనేయులు, కాంట్రాక్టర్లు వెంకటనాగిరెడ్డి, ఈశ్వరరెడ్డి, గోపాల్‌రెడ్డి, శోమశేకర్‌రెడ్డి, సుధాకర్, ధనంజయనాయుడు, వెంకటేష్ సర్కిల్ ఆఫీస్ ఏఈఈ లక్ష్మీదేవి పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం



పత్తి కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

గుత్తి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రైతాంగ సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. పట్టణంలోని మార్కెట్ యార్డులో శుక్రవారం కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పత్తి రైతులకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పిస్తోందన్నారు. పత్తిలో తేమ శాతాన్ని బట్టి రైతులకు ధర అందుతుందన్నారు. గరిష్ఠంగా క్వింటాల్‌కు రూ.8100, కనిష్ఠంగా రూ.8010వేలు ధర చెల్లిస్తారని తెలిపారు. రైతులు దళారుల చేతిలో మోస పోకుండా పత్తికొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ ఏడీ రాఘవేంద్రకుమార్, జేడీఏ ఉమామహేశ్వరమ్మ, ఆర్డీఓ శ్రీనివాస్, ఏడీఏ వెంకటరాముడు, తహసీల్దార్ పుణ్యవతి, మార్కెట్ యార్డు చైర్మన్ ప్రతాప్, గుత్తి, పామిడి, పెద్దవడుగూరు ఏఓలు ముస్తాక్ అహ్మద్, విజయ్‌కుమార్, మునికృష్ణ, మార్కెట్ యార్డు సెక్రటరీ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ టేబుల్‌టెన్నిస్ పోటీలకు ఎంపిక



కోచ్, తండ్రితో మనస్విని

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ టేబుల్‌టెన్నిస్ పోటీలకు మనస్విని ఎంపికయింది. ఈనెల 22వతేదీ నుంచి జమ్మూకశ్మీర్‌లోని జమ్మూ యూనివర్సిటీలో జరిగే నేషనల్ టేబుల్‌టెన్నిస్ టోర్నమెంట్‌లో అండర్-19 బాలికల విభాగంలో మనస్విని రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించనుంది. జాతీయ పోటీలకు ఎంపికైన మనస్వినిని ఆమె తండ్రి, రాయ్ టేబుల్‌టెన్నిస్ అకాడమీ కోచ్ రవీంద్రనాథ్, అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

నాలుగేళ్ల కిందటి కేసు విచారణ

నారాయణ మృతి కేసులో విచారణ ప్రారంభం

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ

నా భర్తను పోలీసులే చంపారు: మృతురాలి భార్య



నారాయణ (ఫైల్)

పెద్దపప్పూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమనపల్లి గ్రామానికి చెందిన నారాయణ మృతిపై అనంతపురం డీఎస్పీ శ్రీనివాసులు శుక్రవారం విచారణ ప్రారంభించారు. నారాయణ 2021 ఆగస్టు 2న మృతి చెందిన విషయం తెలిసిందే. తన భర్త చావుకు అప్పటి డీఎస్పీ చైతన్య, ఎస్ఐ గౌస్ కారణమని నారాయణ భార్య వెంకటలక్ష్మి అధికారుల వద్ద అప్పట్లోనే వాపోయింది. కానీ ఎవరూ పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక విషయాన్ని ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డికి ఆమె వివరించింది. దీంతో ఆయన నారాయణ మృతి విషయాన్ని అసెంబ్లీ వేదికగా లేవనెత్తారు. దీంతో ప్రభుత్వం ఈ కేసును కూలంకషంగా విచారించాలని జిల్లా అధికారులను ఆదేశించింది. ఈనేపథ్యంలో అనంతపురం డీఎస్పీ శ్రీనివాసులు శుక్రవారం సంఘటనా స్థలానికి వచ్చి వివరాలు సేకరించారు. నారాయణ ఎలా మరణించారు కారణాలు ఎవరెవరు అనే దానిపైన పలువురిని విచారించారు. వీటిపై త్వరలో నివేదిక ఇస్తామని ఆయన తెలిపారు.

విచారణ కోసం తీసుకెళ్లి..

బాధితురాలు వెంకటలక్ష్మి ఫిర్యాదు మేరకు... తన భర్త నారాయణను 2021 ఆగస్టు 1 పొలం సమస్య విచారణ కోసం పోలీస్‌స్టేషన్‌కు రావాలని అప్పటి ఎస్ఐ గౌస్ పిలిపించారు. అదే రోజు సాయంత్రం ఆశా వర్కర్ ఇంటి వద్దకు వచ్చి 'మీ భర్త ఆరోగ్యం బాగాలేదు. మీ కుటుంబ సభ్యులు అందరూ కలిసి తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లండి' అని తెలిపారు. దీంతో వెంకటలక్ష్మి తన కుమారుడు, కుమార్తెను తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి పంపించి, బంధువులతో కలిసి పెద్దపప్పూరు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. 'నీ భర్తను తాడిపత్రి డీఎస్పీ ఆఫీస్‌కు చైతన్య సార్ తీసుకురమ్మని చెప్పారు. మేము అక్కడకు పంపాం' అని కానిస్టేబుల్ చెప్పాడన్నారు. దీంతో కంగారుగా అక్కడికి వెళ్లి చూడగా తన భర్త విగతజీవిగా పడి ఉన్నాడని ఆమె వాపోయారు. అప్పటి డీఎస్పీ చైతన్య , ఎస్ఐ గౌస్ విచారణకు తీసుకువెళ్లి నా భర్తను చంపారని ఆమె ఆరోపించారు. ఈ విషయాన్ని ఎవరికి చెప్పవద్దని నీ కుమార్తెకు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని, డబ్బులు ఇస్తానని ఎస్ఐ గౌస్ మభ్యపెట్టి తన భర్త శవాన్ని దహనం చేయించినట్లు ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

అరటి రైతులను ఆదుకోవాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్



అరటి తోటలో రైతులతో రాంభూపాల్, నల్లప్ప

బుక్కరాయసముద్రం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గిట్టుబాటు ధరలేక నష్టపోయిన ఉమ్మడి జిల్లా అరటి రైతులను ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్, సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప డిమాండ్ చేశారు. మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో సాగు చేసిన అరటి పంటను శుక్రవారం వారు పరిశీలించారు. నష్టపోయిన రైతులను పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ రెడ్డిపల్లికి చెందిన రైతు హనుమంతు నాలుగన్నర ఎకరాల్లో అరటి పంట సాగు చేయడానికి రూ.5 లక్షలకు పైగా పెట్టుబడి పెట్టారన్నారు. పంట విక్రయిస్తే రూ. 45 వేలు మాత్రమే వచ్చిందన్నారు. ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో 15వేల హెక్టార్లలో అరటి సాగు చేస్తే రూ. 700 కోట్లకుపైగా నష్టం వచ్చిందన్నారు. రైతుల ఇంత నష్టపోతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. మార్కెట్‌లో అరటి కిలో రూపాయి మాత్రమే ఉందన్నారు. దీంతో రైతులు పంటను మార్కెట్‌కు తరలించలేక గొర్రెలు, పశువులు వదిలేస్తున్నారన్నారు. అరటి పంట టన్ను 15వేలుతో ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అరటి రైతులకు అదుకోకపోతే సీపీఎం అధ్వర్యంలో పెత్తు ఎత్తున అందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, శివారెడ్డి, శ్రీనివాసులు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

1న సర్టిఫికెట్ల వెరిఫికేషన్

ఆర్టీసీ జోనల్ కళాశాల ప్రిన్సిపాల్ నజీర్ అహ్మద్

అనంతపురం టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్ కోసం అక్టోబరు 25 నుంచి ఈనెల 8 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అనంతపురం జిల్లా ఐటీఐ అభ్యర్థులకు డిసెంబరు 1న సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించనున్నట్లు ఆర్టీసీ జోనల్ కళాశాల ప్రిన్సిపాల్ నజీర్ అహ్మద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ విద్యార్హతలు, క్రీడలకు సంబంధించిన ధ్రువ పత్రాలు, కుల ధ్రువీకరణ పత్రం, డ్రైవింగ్ లైసెన్స్, బ్యాంకు ఖాతా పాస్‌బుక్కు, పాస్‌పోర్టుసైజ్ ఫొటోలు, ఆధార్ కార్డు అన్నీ ఒక సెట్ జిరాక్స్ కాపీలతో కర్నూలులోని ఆర్టీసీ జోనల్ సిబ్బంది శిక్షణా కళాశాలకు చేరుకోవాల న్నారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు రూ.118ల ఫీజు చెల్లించాలన్నారు. డిసెంబరు 1న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు డీజిల్ మెకానిక్ ట్రేడ్ అభ్యర్థులకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మోటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, పెయింటర్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్(సివిల్) ఉద్యోగాల అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహిస్తారన్నారు. అభ్యర్థులు వారికి కేటాయించిన సమయాల్లో వెరిఫికేషన్‌కు హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 08518-275025 నంబర్‌ను సంప్రదించవచ్చునన్నారు.

30న భగవద్గీతపై పోటీలు

టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ ప్రోగ్రామ్ అసిస్టెంట్ బాబు

అనంతపురం టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గీత జయంతిని పురస్కరించుకుని ఈనెల 30న జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణమండపంలో భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీలు నిర్వహించనున్నట్లు టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ ప్రోగ్రామ్ అసిస్టెంట్ బాబు వెల్లడించారు. టీటీడీ కల్యాణమండపం ఆవరణలో శుక్రవారం గీత జయంతి ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ పోటీల్లో భాగంగా 6, 7, 8, 9వ తరగతుల విద్యార్థులకు భగవద్గీతలోని 14వ అధ్యాయం గుణత్రయ విభాగయోగంపై పోటీలుంటాయన్నారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు భగవద్గీత 16వ అధ్యాయంలోని దైవాసుర సంపద్విభాగయోగంపై, అలాగే 18 సంవత్సరాలు నిండిన వారికి నిత్యజీవితంలో భగవద్గీత భావ విశ్లేషణపై పోటీలు నిర్వహిస్తారన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని విద్యా సంస్థలు, ఆధ్యాత్మిక బృందాలు పిల్లలను ఈ పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని కోరారు. పోటీల్లో పాల్గొనేవారిలో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు ప్రశంసా పత్రాలు అందజేస్తామన్నారు.

బాధ్యతగా పనిచేయండి

నూతన ఏఓలకు జడ్పీ చైర్‌పర్సన్ సూచన

అనంతపురం న్యూటౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): బాధ్యతగా పనిచేసి మంచి గుర్తింపు తీసుకురావాలని ఉద్యోగోన్నతి పొందిన ఏఓలకు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ సూచించారు. సీనియర్ అసిస్టెంట్ల నుంచి ఏఓలుగా ఉద్యోగోన్నతి పొందిన 8 మందికి శుక్రవారం జడ్పీ కార్యాలయంలో ప్లేస్‌మెంట్స్ కేటాయించారు. ఉద్యోగోన్నతి పొందిన వారికి చైర్‌పర్సన్ చేతుల మీదుగా ప్లేస్‌మెంట్స్‌కు సంబంధించిన నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇప్పటి వరకు సీనియర్ అసిస్టెంట్‌గా కొంత వరకు బాధ్యత తక్కువగా ఉంటుందని, ఏఓ అంటే అదనపు భారం ఉంటుందన్నారు. అందుకు అనుగుణంగా పనిచేసి మంచి గుర్తింపు పొందాలని సూచించారు. ఉద్యోగోన్నతి పొందిన వారికి ప్లేస్‌మెంట్లను కేటాయించారు. లెక్కలు శ్రీనివాసులు (జడ్పీ కార్యాలయం, అనంతపురం), పూర్ణ ఖలందర్ (ఎంపీపీ కార్యాలయం వజ్రకరూరు), కేటీ శ్రీధర్‌శర్మ (ఎంపీపీ, కనగానపల్లి), కె. భీమలింగస్వామి (ఎంపీపీ, రొద్దం), అశోక్‌కుమార్‌రెడ్డి (ఎంపీపీ, నల్లచెరువు), ఏకాంబరేశ్వరయ్య (ఎంపీపీ, గోరంట్ల), అబ్దుల్ రహీమాన్ (ఎంపీపీ, గుడిబండ), సురేష్‌రెడ్డి (ఎంపీపీ కార్యాయలం, తాడిమర్రి)కి నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ శివశంకర్, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, ఏఓ విజయ్‌భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మార్చి 16 నుంచి 'పది' పబ్లిక్ పరీక్షలు

కొత్తచెరువు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలు వచ్చే ఏడాది మార్చి 16 నుంచి ఏప్రిల్ 1దాకా జరుగుతాయని విద్యాశాఖ ఏడీ, జిల్లా పరీక్షల నిర్వహణ అధికారి లాజర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 16న తెలుగు పేపర్-1, 18న హిందీ, 20న ఇంగ్లిషు, 23న గణితం, 25న ఫిజిక్స్, 28న బయాలజీ, 30న సోషియల్, 31న ఫస్టలాంగ్వేజ్ పేపర్-2, ఏప్రిల్ 1న ఒకేషనల్ కోర్సు థియరీ పరీక్షలు ఉంటాయని ఆయన తెలిపారు. ప్రతి రోజు ఉదయం 9-30గంటల నుంచి మధ్యాహ్నం 12-45గంటల వరకు పరీక్షలు జరుగుతాయని ఆయన తెలిపారు.

5న సివిల్స్ ఉచిత శిక్షణకు స్ర్కీనింగ్ పరీక్ష

అనంతపురం విద్య, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సివిల్స్ ఉచిత శిక్షణకు అభ్యర్థులను ఎంపిక చేయడానికి డిసెంబరు 5న స్ర్కీనింగ్ పరీక్ష నిర్వహించనున్నట్లు బీసీ వెల్ఫేర్ శాఖ డీడీ కుష్బూకొఠారి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. యూపీఎస్సీ నిర్వహించే సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షలకు బీసీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇస్తారన్నారు. స్ర్కీనింగ్ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు వసతి, భోజనంతో కూడిన ఉచిత శిక్షణ విజయవాడలో ఇస్తారన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 25లోగా దరఖాస్తులను జిల్లా బీసీ స్టడీ సెంటర్‌లో అందజేయాలన్నారు. బయోడేటాతో పాటు టెన్త్, ఇంటర్, డిగ్రీ మార్కుల జాబితాలు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం, వార్షికాదాయం ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్, రెండు పాస్‌పోర్టుసైజ్ ఫొటోలు దరఖాస్తుతో పాటు అందజేయాలన్నారు.

31మందికి డిప్యూటీ ఎంపీడీఓలుగా ప్రమోషన్

అనంతపురం న్యూటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 31 మందికి డిప్యూటీ ఎంపీడీఓలుగా ప్రమోషన్ ఇచ్చినట్లు డీపీఓ నాగరాజనాయుడు శుక్రవారం తెలిపారు. కమిషనర్ నుంచి వచ్చే ఉత్తర్వుల మేరకు వీరికి మండలాల కేటాయింపు ఉంటుందన్నారు. ప్రమోషన్ పొందిన వారి వివరాలు ఇలా.. సాదిక్‌వలి, శ్రీధర్‌రావు, అచ్యుతానందబాబు, బాబాఫక్రుద్దీన్, శ్రీనివాసులు, రంగనాయకులు, రాజశేఖర్, గౌస్‌సాబ్, భీమలింగస్వామి, ఉషారాణి, మహమ్మద్‌రఫీ, హిదయతుల్లా, చంద్రశేఖర్, ఏకాంబరేశ్వరయ్య, వీవీ నరసయ్య, సమీర్‌ఖాన్, శారద అక్బర్‌వలి, సుజాత, నాగిరెడ్డి, జిలాన్ బాషా, కాంతమ్మ, నందకుమార్, సుకన్య, సరిత, షేక్షావలి, జయప్రద, శశికళావతిబాయ్ ఉన్నారు. వీరిలో గ్రేడ్-1 కార్యదర్శి, సీనియర్ అసిస్టెంట్ స్థాయి నుంచి డిప్యూటీ ఎంపీడీఓలుగా ప్రమోషన్ పొందినవారు ఉన్నట్లు వెల్లడించారు. వరప్రసాద్‌రావును అన్నమయ్య జిల్లా నుంచి అనంతపురం జిల్లాకు కేటాయించినట్లు తెలిపారు. హనుమేష్, జీవేశ్వరయ్యను కర్నూలు జిల్లా నుంచి అనంతపురం జిల్లాకు కేటాయించినట్లు పేర్కొన్నారు. వీరందరికి కమిషనర్ ఆదేశాల మేరకు కలెక్టర్ ఉత్తర్వులతో నిబంధనల మేరకు మండలాలు కేటాయిస్తామన్నారు. అనంతరం డెప్యుటేషన్‌పై మండల గ్రామ-వార్డు సచివాలయ అధికారిగా నియమిస్తామని తెలిపారు.

మరణంలోనూ ఒక్కటిగా..!

అనారోగ్యంతో రిటైర్డు వీఆర్ఏ మృతి.. షాక్‌తో భార్య..



నాగన్న దంపతులు (ఫైల్)

తాడిమర్రి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): దశాబ్దాల దాంపత్య జీవితంలో ఒక్కటిసాగిన ఆ దంపతులు మృత్యువులోనూ కలిసి సాగారు. భర్త మరణవార్త విని భార్య అస్వస్థతతో మరణించిన ఘటన తాడిమర్రిలో శుక్రవారం జరిగింది. మండల కేంద్రానికి చెందిన ఎట్టినాగన్న(85) అనారోగ్యంతో పది రోజులుగా అనంతపురంలో చికిత్స పొందుతుండేవాడు. ఆయనకు తోడుగా భార్యలింగమ్మ(80)అక్కడే ఉండేది. శుక్రవారం ఉదయం 11గంటల సమయంలో నాగన్న మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న భార్య లింగమ్మ షాక్‌తో స్పృహ కోల్పోయింది. పరీక్షించిన డాక్టర్లు లింగమ్మ పరిస్థితి సీరియస్‌గా ఉందని బెంగళూరుకు తీసుకెళ్లాలని కుటుంబసభ్యులకు సూచించారు. దీంతో కొందరు నాగన్న శవాన్ని తాడిమర్రికి తీసుకురాగా మరికొంతమంది లింగమ్మను తీసుకుని బెంగళూరుకు వెళ్లారు. సాయంత్రం 6గంటలకు నాగన్న అంత్యక్రియలు పూర్తిచేశారు. లింగ్మను బెంగళూరులో ఓప్రైవేటు వైద్యశాలలో చేర్పించగా చికిత్స పొందుతూ 6:30గంటలకు ఆమె మృతి చెందారు. నాగన్న, లింగమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

ఉద్యోగం రాలేదని యువకుడి ఆత్మహత్య

కళ్యాణదుర్గంరూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం రాలేదని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం పట్టణ శివారులో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు బ్రహ్మసముద్రం మండలం ఎనకల్లు గ్రామానికి చెందిన బోయ ఆనంద్ (21) డిగ్రీ వరకు చదువుకున్నాడు. అనంతరం ఉద్యోగం బెంగళూరు తదతర ప్రాంతాలకు వెళ్లాడు. ఎక్కడా ఉద్యోగం దొరక్కపోవడంతో రెండు రోజుల క్రితం తన స్వగ్రామమైన ఎనకల్లుకు తిరిగి వచ్చాడన్నారు. ఉద్యోగం రాలేదనే మనస్తాపంతో గురువారం కళ్యాణదుర్గం పట్టణ శివారులో పురుగుల మందు తాగాడన్నారు. తర్వాత ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. ఆందోళన వారు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని ఆనంద్‌ను కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి దాటిన తరువాత మృతి చెందినట్లు తెలిపారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

పదో తరగతి విద్యార్థి అదృశ్యం



శ్యామ్‌చరణ్

అనంతపురం క్రైం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): నగరంలోని అరవింద్ నగర్‌కు చెందిన పదో తరగతి విద్యార్థి శుక్రవారం అదృశ్యమయ్యాడు. అనంతపురం టూటౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్ తెలిపిన మేరకు అరవింద్ నగర్‌కు చెందిన రామాంజినేయులు కుమారుడు దాసరి శ్యామ్ చరణ్(15) నగరంలోని ఎస్ఎస్‌బీఎన్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. యథావిధిగా ఉదయం స్కూ ల్‌కు వెళ్లిన శ్యామ్ చరణ్ తర్వాత ఇంటికి తిరిగి వెళ్లలేదు. పలుచోట్ల గాలించిన తల్లిదండ్రులు ఫలితం లేకపోవడంతో చివరకు పోలీసులను ఆశ్రయించారు. కాగా విద్యార్థిని తల్లిదండ్రులు మందలించినట్లు సమాచారం. దీంతో మనస్తాపం చెంది ఇంటి నుంచీ వెళ్లినట్లు తెలిసింది. విద్యార్థి గుండు గీయించుకున్నాడని, రెండు చెవులకు కమ్మలు ఉన్నాయని, ఆచూకీ తెలిపిన వారు 9440796806, 9346917119 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

గర్భిణులకు సామూహిక సీమంతం

● పాల్గొన్న ఎమ్మెల్యే బండారు శ్రావణి



సీమంతంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు శ్రావణి

నార్పల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక సీమంతాల కార్యక్రమానికి ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ హాజరయ్యారు. ఈ సందర్భంగా బండారు నారాయణస్వామి చారిటబుల్ ట్రస్ట్ తరఫున గర్భిణులకు పండ్లు, చీరలు, పసుపు కుంకుమ, మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ గర్భిణులు వైద్యులు సూచించిన మేరకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మమతా దేవి, ఐసీడీఎస్ అధికారి భారతి, ఏపీఎం తిప్పమ్మ, సింగిల్‌విండో డైరెక్టర్ మహేష్‌నాయుడు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

కుసుమకు అభినందనలు



కుసుమను అభినందిస్తున్న ఎమ్మెల్యే శ్రావణి

నార్పల: కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించిన కుసుమను ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అభినందించారు. కుసుమతో పాటు ఆమె కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే అనంతపురంలోని తన క్యాంప్ కార్యాలయానికి ఆహ్వానించి అభినందించి ఆర్థిక సహాయం అందించారు. అనంతరం మాట్లాడుతూ మహిళలు ఎందులోనూ తక్కువ కాదని కుసుమ నిరూపించిందని కొనియాడారు. ఆమెకు కూటమి ప్రభుత్వం తరఫున అవసరమైన సహాయ సహకారాలను అందిస్తామని హామీ ఇచ్చారు. రానున్న రోజుల్లో ఎవరెస్ట్ పర్వతాన్ని అధిరోహించడమే తన లక్ష్యమని ఎమ్మెల్యేకు కుసుమ తెలిపారు.

ప్రమాదబీమా చెక్కు అందజేత

శింగనమల: మండలంలోని పెద్దజలాలపురం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త గిరిస్వామి రోడ్డుప్రమాదంలో మృతి చెందాడు. ఆయన పార్టీ సభ్యత్వం కలిగి ఉండడంతో పార్టీ నుంచి ప్రమాదబీమా కింద రూ.5లక్షలు మంజూరైంది. ఇందుకు సంబంధించిన చెక్కును ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆ గ్రామానికి వెళ్లి మృతుడి కుటుంబానికి అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కార్యకర్తలకు అండగా నిలుస్తున్న పార్టీ ఒక్క టీడీపీనేనని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ఆదినారాయణ, నాయకులు మారుతీనాయుడు దేగలకృష్ణమూర్తి, షాలినిదొర, ప్రసాద్‌రెడ్డి, సుధీర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అరటి రైతులను ఆదుకోవాలని వినతి



ఎంపీకి వినతి పత్రం ఇస్తున్న రైతుసంఘం నాయకులు

అనంతపురం విద్య, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అరటిరైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను ఏపీ రైతు సంఘం నాయకులు కోరారు. శుక్రవారం వారు ఎంపీని జిల్లాకేంద్రంలోని నివాసంలో కలిసి మాట్లాడారు. ప్రస్తుతం అరటికి ధరలేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వమే టన్ను రూ.20వేలతో కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. అనంతరం వినతి పత్రం అందజేశారు. సంఘం రాష్ట్రకార్యదర్శి మల్లికార్జున, జిల్లా నాయకుడు వేలూరు కృష్ణుడు పాల్గొన్నారు.

చేపల ఉత్పత్తిలో జాగ్రత్తలు పాటించాలి

అనంతపురం అర్బన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): చేపల ఉత్పత్తిలో పలు జాగ్రత్తలు పాటించడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చునని మత్స్యకార శాస్త్రవేత్త జ్ఞానేశ్వర్ సూచించారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక మత్స్యశాఖ ఏడీ కార్యాలయ ఆవరణలో ఆయన మత్స్యకారులతో సమావేశాన్ని నిర్వహించారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవ ప్రాముఖ్యతను వివరించడంతోపాటు, చేపల ఉత్పత్తిని మరింతగా మెరుగుపర్చుకునేందులకు పాటించాల్సిన పద్ధతులను తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడు నగేష్, ఎఫ్‌డీఓలు ఆసిఫ్, లక్ష్మీనారాయణ, బాబు నాయక్, మత్స్య శాఖ సిబ్బంది, పలువురు మత్స్యకారులు పాల్గొన్నారు.

● రామగిరి:మండలంలోని పేరూరులో మత్స్యకారులు ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు. అనంతరం తమకు సహకారం అందిస్తున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

అనంతపురం క్రైం, నవంబరు21(ఆంధ్రజ్యోతి): నగరంలోని అంబేడ్కర్ ఫ్లైఓవర్‌పై గత గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పాతూరుకు చెందిన బాషా, ఆజాద్ నగర్‌కు చెందిన ఇబ్రహీం బైక్‌పై రుద్రంపేట నుంచి నగరంలోకి వెళ్తున్నారు. అయితే ఫ్లైఓవర్ మీదకు రాగానే ఎదురుగా వచ్చిన ఓ వాహనం ఢీకొంది. ప్రమాదంలో బైక్‌పై ఉన్న ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే వారిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఇప్పటి వరకూ పోలీసులు నమోదు చేయలేదు.

హాస్టళ్ల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

● మీరిచ్చే వివరాలు ఏఐతో పరిశీలన
● వార్డెన్లకు డీడీ కుష్బూకొఠారి హెచ్చరిక



సమావేశంలో మాట్లాడుతున్న డీడీ కుష్బూకొఠారి

అనంతపురం విద్య, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సంక్షేమ హాస్టళ్ల నిర్వహణలో నిర్లక్ష్యం తగదని, ఎవరైనా నిర్లక్ష్యం చేసి తప్పుడు సమాచారం ఇస్తే ఏఐ పట్టుకుంటుందని వార్డెన్లను బీసీ, ఎస్సీ సంక్షేమశాఖ డీడీ కుష్బూకొఠారి హెచ్చరించారు. స్థానిక బీసీ స్టడీ సర్కిల్లో శుక్రవారం ఆమె బీసీ, ఎస్సీ హాస్టళ్ల వార్డెన్లతో వేర్వేరుగా సమావేశం నిర్వహించి మాట్లాడారు. హాస్టళ్లకు సంబంధించి హెచ్‌పీటీఎస్‌లో ప్రత్యేక యాప్ ఏర్పాటు చేశారని, అందులో ప్రతి సమాచారం, ఫొటోలతో సహా అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. యాప్‌లో అప్‌లోడ్ చేసిన ప్రతి సమాచారం, ఫొటోలు కృత్రిమ సదస్సు(ఏఐ)తో పరిశీలించబడతాయన్నారు. ఎలాంటి తప్పుడు సమాచారం ఇచ్చినా ఏఐ పట్టుకుంటుందన్నారు. అందుకే ప్రతివార్డెన్ బాధ్యతగా విధులు నిర్వర్తిస్తూ సమాచార వివరాలు అప్‌లోడ్ చేయాలని సూచించారు. హాస్టల్ నిర్వహణలో నిర్లక్ష్యం చేయరాదన్నారు. ఎక్కడైనా సమస్యలు బయటకొస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డివిజన్ల అధికారులు నిత్యం హాస్టళ్లను తనిఖీలు చేయాలని ఆదేశించారు. సమావేశంలో బీఎస్‌డబ్ల్యూఓలు, ఏఎస్‌డబ్ల్యూఓలు, జిల్లాలోని అన్నిమండలాల బీసీ, ఎస్సీ హాస్టల్ వార్డెన్లు పాల్గొన్నారు.

పాతాళానికి వైసీపీ గ్రాఫ్

● ప్రజాదర్బార్‌లో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత



ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రజల్లో వైసీపీ గ్రాఫ్ పాతాళానికి పడిపోయిందని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. రూరల్ మండల ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీఓ దివాకర్ అధ్యక్షతన జరిగిన ప్రజాదర్బార్‌కు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండల ప్రజలు పెద్దఎత్తున పాల్గొని వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ వినతిపత్రాలు అందజేశారు. ముఖ్యంగా రోడ్లు, సాగునీరు, తాగునీరు, భూసమస్యలు, ఇళ్లు, ఇళ్లపట్టాలు, పింఛన్లు, దారి సమస్యలపై అధికంగా వినతులు అందజేశారు. ఎమ్మెల్యే వాటిని స్వీకరించి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. అధికారులు ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. చిత్తశుద్ధితో పనిచేస్తే ఎక్కువ శాతం సమస్యలు స్థానికంగానే పరిష్కారమవుతాయని అన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ త్వరలోనే ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారు. వైసీపీ నాయకులు ఏ రోజైనా ఇలా ప్రజల మధ్యకు వచ్చారా అని ప్రజలను ప్రశ్నించారు. వారి పార్టీ గ్రాఫ్ ఇప్పటికే తుడిచిపెట్టుకుపోయిందని అన్నారు. రానున్న రోజుల్లో ఆ పార్టీ మనుగడే కష్టమేనని తెలిపారు. తర్వాత ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్యవివాహాలు, పోక్సో చట్టం, అత్యవసర హెల్ప్‌లైన్ నెంబర్లు వంటి కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఆర్ డీఈ నారాయణస్వామ, హౌసింగ్ డీఈ శ్రీమన్నారాయణ, తహసీల్దార్ మోహన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు స్థల పరిశీలన

రాప్తాడు: మండల కేంద్రంలో టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు, మాజీ మంత్రి పరిటాల రవీంద్ర విగ్రహాల ఏర్పాటుకు ఎమ్మెల్యే పరిటాల సునీత శ్రీకారం చుట్టారు. ఈ మేరకు స్థానిక నాయకులతో కలిసి విగ్రహాల ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. ఎంపీడీఓ కార్యాలయ సమీపంతో పాటు మరో రెండు మూడు చోట్ల స్థలాలను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... త్వరలోనే విగ్రహాల ఏర్పాటు పనులు ప్రారంభమవుతాయని తెలిపారు.

పరిశోధనలపై దృష్టి సాధించాలి

● జేఎన్‌టీయూఏ వీసీ సుదర్శనరావు సూచన



మాట్లాడుతున్న వీసీ సుదర్శనరావు

అనంతపురంరూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): అధ్యాపకులు రెగ్యులర్ విద్యాబోధనతో పాటు పరిశోధనలపై కూడా దృష్టి సారించాలని జేఎన్‌టీయూఏ వైస్ చాన్సలర్ సుదర్శనరావు సూచించారు. జేఎన్‌టీయూఏలో శుక్రవారం పెయిర్(పార్టనర్‌షిప్ ఫర్ ఆక్సిలేరాటెడ్ ఇన్నొవేషన్ అండ్ రీసెర్చ్)ప్రోగ్రాంకు సంబంధించి పోస్ట్ ఇన్‌స్టిట్యూట్ ఐఐటీ హైదరాబాద్ ప్రిన్సిపల్ ఇన్విస్టిగేటర్ ఆచార్య చంద్రశేఖర్ శర్మ పీహెచ్‌డీ స్కాలర్స్‌తో చర్చించారు. వర్సిటీ అధ్యాపకులతోనూ ఇష్టాగోష్టిగా చర్చించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వర్సిటీ వీసీమాట్లాడుతూ.. అధ్యాపకులు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుని పరిశోధనలపై కూడా దృష్టి సారించాలని సూచించారు. ఇందుకు యూనివర్సిటీ తరఫున అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. రిజిస్ట్రార్, ఓఎస్‌డీ టూ వీసీ ఆచార్య దేవన్న, డీపీపీ ఆచార్య ఎస్‌వీ సత్యనారాయణ, డైరెక్టర్లు, కళాశాల ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి, హెచ్‌ఓడీలు, కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

కుష్ఠు నివారణకు సర్వే తప్పని సరి

● అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి

గార్లదిన్నె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కుష్ఠు నివారణకు క్షేత్రస్థాయిలో ఇంటింటా సర్వే తప్పని సరిగా చేపట్టాలని అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి వైద్యులకు సూచించారు. మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆమె తనిఖీ చేసి మందుల గదిని పరిశీలించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో జరుగుతున్న కుష్ఠు పీడితుల గుర్తింపు సర్వేపై వైద్యాధికారి ఉదయ్‌తో చర్చించారు. తర్వాత మాట్లాడుతూ... ఈనెల 17 నుంచి 30 వరకు కుష్ఠు పీడితుల గుర్తింపు సర్వేను గ్రామాల్లో ఇంటింటా తప్పని సరిగా చేపట్టాలని సిబ్బందికి సూచించారు. దీనిపై నిర్లక్ష్యం చేయరాదన్నారు. సర్వేలో ఎవరికైనా కుష్ఠు లక్షణాలు ఉన్నట్లు తెలిస్తే వెంటనే జిల్లా వైద్యాధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ లోక్‌నాథ్, పీఎం నాగన్న, హెచ్‌ఐవీ కంట్రోల్ జిల్లా సూపర్‌వైజర్ నాగన్న, సూపర్ వైజర్లు నరసమ్మ, కృష్ణమోహన్, ఫార్మాసిస్ట్ పవన్, ల్యాబ్ టెక్నీషియన్ కిరణ్, స్టాఫ్ నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన బాస్కెట్‌బాల్ శిక్షణ



శిక్షణ ముగింపులో బాస్కెట్‌బాల్ బాలుర జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్ఎస్‌బీఎన్ కళాశాల స్టేడియంలో నెల రోజులుగా కొనసాగుతున్న ఎస్‌జీఎఫ్ జిల్లా అండర్-14 బాలుర బాస్కెట్‌బాల్ జట్టు శిక్షణా శిబిరం శుక్రవారం ముగిసింది. నెల రోజుల పాటు కోచ్ నరేంద్రకృష్ణ ఆధ్వర్యంలో శిక్షణ, భోజన వసతి కల్పించారు. ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శ్రీనివాసులు, సభ్యులు, కోచ్, జట్టు క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ బాస్కెట్‌బాల్ పోటీల్లో విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా బాస్కెట్‌బాల్ సీనియర్ క్రీడాకారులు నరసింహారెడ్డి, సిరాజ్, అర్షద్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీసీ శిక్షణ కేంద్రంలో వైద్యశిబిరం

అనంతపురం అర్బన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నగర శివారులోని పంగల్ రోడ్డు సమీపంలోగల టీటీడీసీ శిక్షణ కేంద్రంలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ శిక్షణ పొందుతున్న యువతీ యువకులకు బీపీ, షుగర్, కంటి పరీక్షలు, ఈసీజీ తదితర పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సీడాప్ జిల్లా మేనేజర్ సూర్యనారాయణ, వైద్యులు శివప్రసాద్, నూర్‌చష్మి, లక్ష్మీ. నారాయణస్వామి, ఏఎన్‌ఎంలు ,ఆశవర్కర్లు పాల్గొన్నారు.

శైలజానాథ్‌కు మాతృవియోగం



సాకే గంగమ్మ (ఫైల్)

అనంతపురం కలెక్టరేట్/శింగనమల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, వైసీపీ శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త శైలజానాథ్‌కు మాతృవియోగం కలిగింది. నగరంలోని ఆదర్శనగర్‌లో నివాసముంటున్న శైలజానాథ్ తల్లి సాకే గంగమ్మ(81)అనారోగ్యంతో శుక్రవారం ఉదయం మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంతవెంకటరామిరెడ్డి ఆమె భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు. అదేవిధంగా వైసీపీ నాయకులు పెద్దారెడ్డి, విశ్వేశ్వరరెడ్డి, తలారి రంగయ్య, గోరంట్ల మాధవ్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, ,నాయకుడు దాదా గాంధీ, ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ అధ్యక్షుడు సాకే హరి తదితరులు నివాళులర్పించారు.

రేపు పౌరాణిక నాటక ప్రదర్శన

అనంతపురం రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): భగవాన్ సత్యసాయి బాబా శత జయంతిని పురస్కరించుకుని ఆదివారం నాగదుర్గ నాటక కళా సమితి ఆధ్వర్యంలో ఉచిత పౌరాణిక నాటకను ప్రదర్శించనున్నట్లు సమితి అధ్యక్షుడు రత్నమోహన్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. నగరంలోని కృష్ణ కళామందిరంలో రాత్రి 7:30 గంటలకు కారక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. నగర ప్రజలు విజయవంతం చేయాలని కోరారు.

ఉత్తమ విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులను జ్ఞాపికలతో సత్కరిస్తున్న దృశ్యం

అనంతపురం టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక సెయింట్ ఆన్స్ పాఠశాలలో శుక్రవారం 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి టెన్త్‌ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ సిస్టర్ మేరీ ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమానికి తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సేవాసంస్థ అధ్యక్షుడు టీవీ రెడ్డి, కళాభూషణ్ డాక్టర్ అంకె రామలింగయ్య ముఖ్యఅతిథులుగా హాజరై విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెడల్స్, పుస్తకాలను అందజేసి సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ... విద్యార్థులు తమలోని ప్రతిభను వ్యక్తపరుచుకోవాలంటే ఉత్తమ మార్కులు సాధించడం ద్వారానే వీలవుతుందన్నారు. అత్యున్నత స్థానాలు అధిరోహించాలంటే విద్యతోనే సాధ్యపడుతుందన్నారు. కాబట్టి ఆమేరకు ప్రతి విద్యార్థి శ్రమించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ.. 13 మందిపై కేసు నమోదు

రామగిరి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరూరు గ్రామంలో ఇరువర్గాల మధ్య గురువారం రాత్రి ఘర్షణ జరిగింది. దీనిపై ఇరువర్గాల ఫిర్యాదు మేరకు 13మందిపై పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ముత్యాలప్ప(యజమానప్ప)కుటుంబసభ్యులు ఏడుగురిపై, అదే విధంగా రాజన్న కుటుంబసభ్యులు ఆరుగురుపై కేసులు నమోదు చేశారు. ఇరువర్గీయులు బంధువులు కావడం, భూసమస్యపై ఘర్షణ పడి దాడులు చేసుకోవడం వల్ల తలలకు రక్తగాయాలవడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

టీడీపీ కార్యకర్తపై ఫీల్డ్ అసిస్టెంట్ దాడి

బుక్కరాయసముద్రం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్ధరాంపురంలో ఉపాధి పనుల్లో అవినీతిపై ప్రశ్నించినందుకు టీడీపీ కార్యకర్త కొండారెడ్డిపై ఫీల్డ్ అసిస్టెంట్ విశ్వనాథ్, అతడి తండ్రి సూరి దాడి చేశారు. సిద్దరాంపురం గ్రామంలో ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ విశ్వనాథ్ అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నాడని ఇటీవలే ఉపాధి పథకం అధికారులకు టీడీపీ కార్యకర్త కొండారెడ్డి ఫిర్యాదు చేశాడు. ఈ విషయంపై ఆగ్రహం చెందిన ఫీల్డ్ అసిస్టెంట్, అతడి తండ్రి శుక్రవారం ఉదయం గ్రామంలో కొండారెడ్డిపై దాడి చేసి గాయపరిచారు. దీనిపై ఫిర్యాదు చేయగా పోలీసులు తీసుకోలేదని బాధితుడు వాపోయాడు.

సుబ్రహ్మణ్యేశ్వరుడి కల్యాణానికి ఆహ్వానం

ఆత్మకూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పంపనూరు ఆలయంలో ఈ నెల 26వ తేదీన సుబ్రహ్మణ్య షష్ఠిని పురస్కరించుకుని సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి కళ్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే పరిటాల సునీతను ప్రత్యేక అతిథిగా దేవాదాయ శాఖకమిషనర్ వన్నూరు స్వామి, కార్య నిర్వహణాధికారి బాబు, ప్రధాన అర్చకులు రాముస్వామి శుక్రవారం ఆహ్వానించారు. అలాగే హిందూపురం ఎంపీ బీకే పార్థసారధి, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌ను ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నేత వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతపై వైసీపీ నాయకుల దాడి



బాధితుడిని పరామర్శిస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్

అనంతపురం క్రైం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక 3వ డివిజన్‌లో గల వేణుగోపాల్ నగర్‌లో శుక్రవారం టీడీపీ 212 బూత్ కన్వీనర్ కురవ గోపాల్‌పై వైసీపీ నాయకులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఉదయం 8:20 గంటలకు గోపాల్‌పై వైసీపీ నాయకులు కట్టెలు, కొడవలితో దాడి చేసినట్టు సమాచారం. దీంతో ఆయన తలపై, చేతిపైన గాయాలయ్యాయి. అతడిని కుటుంబసభ్యులు, స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై బాధితుడి భార్య వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మరోవైపు వైసీపీ నాయకులు దాడి చేయడమే కాకుండా కదిరప్ప అనే దళిత వ్యక్తిపై తాము దాడి చేసినట్టు ఫేక్ ప్రచారం చేస్తున్నారంటూ బాధితులు మండిపడ్డారు. దీనిపై వన్‌టౌన్ సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ....3వ డివిజన్‌లో గొడవ జరిగిందన్నారు. విచారణ చేసి కేసు నమోదు చేస్తామని తెలిపారు.

మూల్యం చెల్లించక తప్పదు: టీడీపీ జిల్లా అధ్యక్షుడు

వైసీపీ నాయకులు తమ పార్టీ నేతలపై చేసే దాడులకు మూల్యం చెల్లించుకోక తప్పదని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ హెచ్చరించారు. 3వ డివిజన్‌లో వైసీపీ నేతల దాడిలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గోపాల్‌ను ఆయనతోపాటు ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు గంగారామ్, ఇతర నాయకులు పరామర్శించారు. టీడీపీ అండగా ఉంటుందని, అధైర్యపడకూడదని భరోసా ఇచ్చారు. తర్వాత జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ... వైసీపీ నాయకులు అధికారం కోల్పోయినా.. దాడులు చేయడం మానలేదన్నారు. నాడు అధికారాన్ని అడ్డం పెట్టుకుని అనేక దాడులు చేశారన్నారు. ఇప్పుడు కూడా అలాగే చేస్తాం అంటే చూస్తూ ఊరుకోమన్నారు. గోపాల్ బూత్ ఇన్‌చార్జిగా నియమితుడయ్యాడన్న అక్కసుతోనే దాడి చేశారన్నారు. దాడికి పాల్పడిన కార్పొరేటర్ భర్త కృష్ణమూర్తి, రాణినగర్‌కు చెందిన షామీర్, సురేష్ రెడ్డి, బాబా, దూదేకుల దస్తగిరి, శివ పై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో 10వ క్లస్టర్ ఇన్‌చార్జి శ్రీధర్, తెలుగు యువత రాష్ట్ర ప్రధానకార్యదర్శి సుధాకర్ యాదవ్, టీఎన్టీయూసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మోహన్‌కుమార్, డివిజన్ నాయకులు నాగరాజు, కందుకూరి రాధా, మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనంతా కక్షలు, కార్పణ్యాలే

● పీజీఆర్ఎస్‌లో అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి విమర్శ



వినతి పత్రాలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్

అనంతపురం క్రైం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలన అంతా కక్షలు, కార్పణ్యాలతోనే సాగిందని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ విమర్శించారు. నగరంలోని టీడీపీ అర్బన్ కార్యాలయంలో శుక్రవారం ఆయన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)ను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ వినతి పత్రాలను సమర్పించారు. వాటిని ఎమ్మెల్యే స్వీకరించి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. గత వైసీపీ పాలన కక్షలు, కార్పణ్యాలతోనే సాగిందన్నారు. ఈ క్రమంలో 2014 - 2019 మధ్యకాలంలో టీడీపీ హయాంలో చేపట్టిన టిడ్కో ఇళ్లను వైసీపీ వచ్చాక సర్వ నాశనం చేసిందన్నారు. వాటిని అభివృద్ధి చేయకపోగా.. వీటిపై రుణాలు తీసుకుని దిగిపోయారన్నారు. తర్వాత కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ ఇళ్ల నిర్మాణాలను మళ్లీ చేపట్టిందన్నారు. మార్చి చివరికి వాటిని పూర్తి చేసి లబ్ధిదారులకు అందిస్తామన్నారు. గత ప్రభుత్వంలో 80 ఏళ్ల వృద్ధులకు సైతం పింఛన్లు తొలగించారన్నారు. త్వరలో అలాంటి వారికి పింఛన్లు ఇస్తామని, రేషన్ కార్డులు సైతం మంజూరు చేస్తామని అన్నారు. కొందరు వైసీపీ నేతల భూకబ్జాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ తీసుకొచ్చామని, ఇచ్చిన ప్రతి హామీ త్వరలోనే కార్యరూపం దాల్చేలా చూస్తామని పేర్కొన్నారు. నడిమివంక, మరువవంకల చుట్టూ ప్రహరీ నిర్మాణాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేషన్ల డైరెక్టర్లు పరమేశ్వర్, పోతుల లక్ష్మీనరసింహులు, పీఎల్ఎన్ మూర్తి, కడియాల కొండన్న,రంగాచారి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా సోలార్ వెలుగులు రావాలి

అవకాశం ఉన్న ప్రతి ఇంటిలో పీఎం సూర్యఘర్ యోజన కింద వెలుగులు వచ్చేలా చూడాలని ఎమ్మెల్యే దగ్గుపాటి అధికారులను ఆదేశించారు. తన క్యాంపు కార్యాలయంలో ఆయన మెప్మా అధికారులతో పీఎం సూర్యఘర్, తృప్తిక్యాంటీన్లు, స్ట్రీట్ ఫుడ్స్ తదితర అంశాలపై చర్చించారు. ఎంత మంది పీఎం సూర్యఘర్‌కు దరకాస్తు చేసుకున్నారు..? ఎంతమంది యూనిట్లు ఏర్పాటుచేసుకున్నారంటూ ఆరా తీశారు. అదేవిధంగా తృప్తి క్యాంటీన్లు, ఇతర అంశాలపై ఆరా తీశారు.

పీఎం ఆవాస్ యోజనకు దరఖాస్తు చేసుకోండి

శింగనమల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని గృహాలు లేని వారు ప్రధానమంత్రి అవాస్ యోజన పథకం కింద దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. అర్హులు ఈనెల 30వ తేదీలోపు ఇంటి మంజూరు కోసం సచివాలయ సిబ్బంది వద్దకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. రెవెన్యూ అధికారులు ఇంటి కోసం పొజిషన్ సర్టిఫికెట్ జారీ చేయడంలో నిర్లక్ష్యం చేయరాదని ఆదేశించారు. లబ్ధిదారులు అడిగిన వెంటనే సర్టిఫికెట్ ఇవ్వాలన్నారు. ఈ గృహాలకు విషయంలో రెవెన్యూ, ఇతర అధికారులు నిర్లక్ష్యం చేస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

టీచర్ల సమస్యలను పరిష్కరించండి: ఏపీటీఎఫ్

అనంతపురం విద్య, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న టీచర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ నాయకులు రాయల్ వెంకటేశులు, సిరాజుద్దీన్, నరసింహులు డిమాండ్ చేశారు. స్థానిక ఉపాధ్యాయభవన్‌లో శుక్రవారం ఏపీటీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఇందులో వారు మాట్లాడుతూ పీఆర్‌సీ కమిషన్‌ను నియమించాలని, ఐఆర్ ప్రకటించాలని కోరుతున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. పీఆర్సీ బకాయిలు,డీఏలు చెల్లించకుండా టీచర్లను ఇబ్బందులకు గురిచేయడం దారుణమన్నారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించాలన్నారు. లేకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. నాయకులు సతీష్‌కుమార్, సర్దార్‌వలి, వెంకటరమణ, వన్నప్ప, తిమ్మప్ప, చెన్నకేశవులు, చిదంబరరెడ్డి, తిప్పేస్వామి,నజీర్,నాగరాజు,మహేష్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

క్వారీలపై చర్యలు తీసుకోవాలని వినతి

అనంతపురం కలెక్టరేట్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): అనంతపురం రూరల్ మండల పరిధిలో బ్లాస్టింగ్ చేస్తూ ఇబ్బందులు కలిగిస్తున్న క్వారీలపై చర్యలు తీసుకోవాలని క్రిష్ణమరెడ్డిపల్లి గ్రామస్థులు కోరారు. ఈ మేరకు శుక్రవారం కాలుష్య నియంత్రణ మండలి అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. కందుకూరు పొలం సర్వే నెంబరు 50, 51లలో 18 ఎకరాలు, సర్వేనెంబరు 64లో 6 ఎకరాలు, ఇంకా పలువురు రైతులకు సంబంధించి మొత్తం 80 ఎకరాలతో పాటు చియ్యేడు పొలం సర్వేనెంబరు 231లోని పొలాల్లో క్వారీలు వెలిశాయని, వాటిల్లో విచ్చలవిడిగా బ్లాస్టింగ్ చేస్తూ పంట పొలాలకు ఇబ్బంది కలిగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను పరిగణలోకి తీసుకుని వాటిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

రేపు గిరిజన ప్రజా సంక్షేమ సంఘం ఆవిర్భావ సభ

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రజా సంక్షేమ సంఘం ఆవిర్భావ సభను పాతూరులో ఉన్న గిరిజన భవన్‌లో ఆదివారం ఉదయం 10గంటలకు నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మల్లికార్జున నాయక్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. భారత రాజ్యాంగంలో పొందుపరిచిన గిరిజన హక్కులపై గిరిజనులకు అవగాహన కల్పిస్తామన్నారు. గత ఐదేళ్లలో గిరిజనులకు జరిగిన అన్యాయంపై చర్చిస్తామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గిరిజనులు అధిక సంఖ్యలో హాజరవ్వాలని కోరారు.

దేశాభివృద్ధిలో ఎన్ఎస్ఎస్‌పై అవగాహన

అనంతపురం రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఎస్కే యూనివర్శిటీలోని బీఈడీ కళాశాలలో శుక్రవారం దేశ అభివృద్ధిలో ఎన్ఎస్ఎస్ అనే అంశంపై అవగాహన సదస్సు ప్రిన్సిపాల్ సోమశేఖర్ అధ్యక్షతన జరిగింది. సోషియాలజీ ప్రొఫెసర్ జీవీ రమణ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సమాజంపై తమదైన ముద్ర వేయాలన్నారు. సమాజాన్ని మార్చడం కోసం కృషి చేయాలన్నారు. వివేకానంద స్ఫూర్తితో జాతీయ భావాలను పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్‌కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ మురళీధర్, కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

పెరిగిన కంది సాగు

● వేరుశనగపై రైతుల నిరాసక్తత
● ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు

కూడేరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో గతంలో అధికంగా సాగుచేసే వేరుశనగ పంటపై రైతులు కాలక్రమేన నిరాసక్తి చూపుతున్నారు. వేలాది రూపాయలు అప్పులు చేసి సాగు చేస్తే, సకాలంలో వర్షాలు రాక పంటలు పండక పలుమార్లు నష్టపోయారు. దీంతో పెట్టుబడులు కూడా రాకపోవడంతో అనేక మంది ప్రత్యామ్నాయ పంటలపై మొగ్గు చూపారు. తక్కువ పెట్టుబడులతో సాగు చేసే ఆముదం, కంది సాగు విస్తీర్ణం మూడేళ్లల్లో భారీగా పెరిగింది. కంది, ఆముదం పంటలకు మార్కెట్‌లో ఆశాజనంగా ధర పలుకుతుండటంతో రైతులు ఆ పంటల సాగు చేస్తున్నారు.

● కంది సాగే అధికం : మండలంలో ఆముదం పంట సాగు కంటే కంది పంటకే రైతులు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇందుకు ప్రధాన కారణం ఆముదం పంటకు తెగుళ్లు ఎక్కువగా సోకుతాయి. దీంతో ఆముదం కంటే కందినే ఎక్కువగా సాగు చేస్తున్నారు. అంతేకాకుండా మార్కెట్‌లో కందులకు మంచి డిమాండ్ ఉండటంతో అనేక మంది రైతులు ఈ పంట సాగుపై ఆసక్తి చూపుతున్నారు.

● ఏటా సాగు ఇలా.. : 2023 ఖరీఫ్‌లో ఆముదం పంటను 10,240 ఎకరాల్లో సాగు చేయగా, కంది 3,103 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. 2024 ఖరీఫ్‌లో ఆముదం సాగు 5,400 ఎకరాలకు పడిపోయి, కంది 9,202 ఎకరాలకు పెరిగింది. 2025 ఖరీఫ్‌లో ఆముదం పంట 6,537 ఎకరాల్లో సాగు చేయగా, కంది ఏకంగా 11,962 ఎకరాల సాగు చేస్తున్నారు. ఇలా ఏటా కంది సాగు విస్తీర్ణం మండలంలో పెరుగుతోంది. ప్రస్తుతం కంది పంట పూత, పిందే దశలో ఉంది. వ్యవసాయశాఖ అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని పలు గ్రామాల్లో నిర్వహిస్తూ కంది పంటపై రైతులకు సలహాలు, సూచనలు అందిస్తున్నారు.


ఇప్పేరు సమీపంలో సాగు చేసిన కంది పంట

ప్రజాదర్బార్‌లో ఫిర్యాదుల స్వీకరణ

గుమ్మఘట్ట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు మండల కేంద్రంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ప్రజల నుంచి సుమారు 150 ఫిర్యాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రజాక్‌వలి, ఎంపీడీఓ జయరాములు, మండల కన్వీనర్ కాలవ సన్నన్న, మాజీ కన్వీనర్ గిరిమల్లప్ప, సర్పంచ్ విజయలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

● మత్స్యకారుల దినోత్సవం :ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా విప్ కాలవ గుమ్మఘట్టలో కేక్ కట్ చేశారు. బీటీపీ మత్స్య సహకార సంఘం ఉత్తమ సంఘంగా ఎంపిక కావడంతో ఆ సంఘం అధ్యక్షుడు బెస్త శ్రీరాములుకు అధికారులు పురస్కారం అందజేశారు.

● అభివృద్ధి పనులకు భూమిపూజ
రాయదుర్గం : పట్టణంలో రూ. 4.15 కోట్లతో సీసీ రోడ్డు, మురికికాలువ నిర్మాణానికి విప్ కాలవ శుక్రవారం భూమిపూజ చేశారు.

● ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం..
గుత్తి : స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ పుణ్యవతి, మున్సిపల్ కమిషనర్ జబ్బర్‌మీయా, ట్రాన్స్‌కో ఈఈ పద్మానాభ పిళ్లై, ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్, సీఐ రామారావు, మార్కెట్ యార్డు చైర్మన్ ప్రతాప్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

● నవజాత శిశు సంరక్షణ యూనిట్ ప్రారంభం
గుంతకల్లు : స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నవజాత శిశు సంరక్షణ యూనిట్‌ను ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం శుక్రవారం ప్రారంభించారు. నవజాత శిశువులకు ఆరోగ్య సమస్యలు ఏర్పడితే కర్నూలు, బళ్లారి, హైదరాబాదు, బెంగళూరు నగరాలకు తీసుకెళ్లాల్సి వచ్చేదని, ఇక్కడ ఈ యూనిట్ ఏర్పాటుతో ఇక ఆ ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంటు జయవర్ధన్‌రెడ్డి, ఆర్డీఓ శ్రీనివాసులు, తహసీల్దారు రమాదేవి, టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి, ఆసుపత్రి కమిటీ నాయకులు యుగంధర్, రామ్మూర్తి, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, తలారి మస్తానప్ప, హనుమంతు పాల్గొన్నారు.



గుమ్మఘట్టలో విప్ కాలవ, గుత్తిలో ఎమ్మెల్యే గుమ్మనూరు ఫిర్యాదులు స్వీకరిస్తున్న దృశ్యం

గడ్డివామికి నిప్పు

యాడికి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని దైవాలమడుగులో పుల్లారెడ్డికి చెందిన జొన్న చొప్ప వామికి గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పెట్రోల్ చల్లి నిప్పుపెట్టారు. గ్రామస్థులు అప్రమత్తమై ఆ మంటలు సమీపంలోనే నిల్వచేసిన పత్తి వామికి వ్యాపించకుండా అడ్డుకున్నారు. జొన్న చొప్ప మొత్తం కాలిపోవడంతో రూ. 20 వేల నష్టం వాటిల్లినట్లు పుల్లారెడ్డి వాపోయాడు. పోలీసులు శుక్రవారం ఆ గడ్డివామిని పరిశీలించారు.

వ్యక్తికి గాయాలు

శెట్టూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : మండలంలోని బొచ్చుపల్లి గ్రామానికి చెందిన వీరన్న శుక్రవారం బైక్‌లో చెర్లోపల్లికి వెళ్తుండగా.. ఎదురుగా వచ్చిన బొలెరో ఢీకొంది. ఈ ప్రమాదంలో వీరన్న కుడికాలుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతన్ని కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

సివిల్ ఇంజనీర్‌కు..

గుత్తిరూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కర్నూల్‌కు చెందిన అనిల్ కుమార్ బెంగళూరులో సివిల్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. బెంగుళూరు నుంచి బైక్‌పై శుక్రవారం కర్నూలుకు వస్తుండగా.. గుత్తి సమీపంలోని జాతీయ రహదారిపై బైక్ అదుపు తప్పి కిందపడటంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతన్ని గుత్తి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. కేసు దర్యాప్తులో ఉంది.

జాదరుల అరెస్ట్

యల్లనూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుక్కాపురం గ్రామసమీపంలో జూద గృహంపై పీఎస్ఐ రామకృష్ణ, సిబ్బందితో కలిసి శుక్రవారం దాడి చేశారు. నలుగురిని అరెస్ట్ చేసి.. వారి వద్ద నుంచి రూ.4500 స్వాధీనం చేసుకున్నారు.

వ్యాసరచన పోటీలు



విజేతలకు నగదు అందిస్తున్న రవిచంద్రసాగర్

బొమ్మనహాళ్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): శ్రీధరఘట్ట హైస్కూల్‌లో విద్యార్థులకు పోలీసుల సేవల ప్రాముఖ్యతపై వ్యాసరచన పోటీలను స్థానిక టీడీపీ నాయకుడు, సగరా సంఘం జిల్లా అధ్యక్షుడు రవిచంద్రసాగర్ శుక్రవారం నిర్వహించారు. కీర్తికి మొదటి బహుమతిగా రూ. 1000, సమీరకు రెండో బహుమతిగా రూ. 700, గాయిత్రికి మూడో బహుమతిగా రూ. 500 అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం కౌసల్య, నాయకులు అనిల్, సందీప్, రమేష్, పురందర్, తిప్పేస్వామి పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

ఉరవకొండ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక సాయి ఆగ్రో, శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ఏజెన్సీలు, మహాలక్ష్మీ ఫర్టిలైజర్స్‌ను కల్యాణదుర్గం ఏడీఏ ఎస్‌పీ ఎల్లప్ప శుక్రవారం తనిఖీ చేశారు. మూడు దుకాణాల్లో రూ.9.87 లక్షల విలువ చేసే అనుమతులు లేని ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేశారు. ఆయన వెంట ఏఓలు రామకృష్ణ, పెన్నయ్య ఉన్నారు.


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

వజ్రకరూరు (ఉరవకొండ), నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నహోతూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఖోఖో పోటీలకు అనిత, వీణ, మనీష, తిరుమలేష్, గంగాధర్, మురారి, సుదీప, సుమిత్ర, శ్రీచరణ్, భార్గవి, అలాగే రబ్బీ పోటీలకు చరణ్, వైష్ణవి ఎంపికైనట్లు హెచ్ఎం శ్రీనివాస్ రెడ్డి, పీడీ ప్రభాకర్ శుక్రవారం తెలిపారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

గుంతకల్లుటౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు జీఆర్పీ సీఐ సతీష్‌కుమార్ మృతికి కారకులైన దోషులను కఠినంగా శిక్షించాలని కుమ్మరి (శాలివాహన) సంఘం నాయకులు పట్టణంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. గుంతకల్లు డీఎస్పీ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. ఇందులో ఆ సంఘం అధ్యక్షుడు రామాంజినేయులు, నాయకులు చంద్రశేఖర్, ఓబులపతి, గోవిందు పాల్గొన్నారు.

వైసీపీ నాయకుల భూ కబ్జా

● కలెక్టర్‌కు ఫిర్యాదు
● స్వాధీనం చేసుకున్న అధికారులు

బొమ్మనహాళ్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పరహాళ్ గ్రామ శివారులో సర్వే నెంబర్ 51లో రస్తా పొరంబోకు భూమిలో ఒక ఎకరాను అదే గ్రామానికి చెందిన వైసీసీ మద్దతుదారులు గంగన్న, హనుమక్క ఆక్రమించుకున్నారు. దీనిపై అదే గ్రామానికి చెందిన ఓబులుస్వామి కలెక్టర్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. స్పందించిన స్థానిక తహసీల్దార్ మునివేలు, ఎస్ఐ నబీరసూల్, వీఆర్వో నరసింహమూర్తి శుక్రవారం ఆ భూమిని సర్వే చేశారు. వైసీసీ మద్దతుదారులు ఎకరా భూమిని ఆక్రమించుకున్నట్లు గుర్తించారు. ఆ స్థలంలో ఇది ప్రభుత్వ స్థలమని, ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.


బోర్డు ఏర్పాటు చేసిన అధికారులు

చెత్త ఇవ్వండి.. సరుకులు తీసుకోండి

స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై అధికారుల అవగాహన

యాడికి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఇంటి చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా.. ఇంటి వద్దకు వచ్చే గ్రామ పం చాయతీ సిబ్బందికి అందజేసి.. మీకు కావాల్సిన ఇంటి సరుకులను ఉచితంగా తీసుకోవచ్చని ఎంపీడీఓ వీరరాజు, డిప్యూటి ఎంపీడీఓ శశికళ తెలిపారు. యాడికిలో స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంపై ప్రజలకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు అరుణ్‌కుమార్, మహేశ్వర్‌రెడ్డి, రామిరెడ్డి పాల్గొన్నారు.

● పామిడి : ఎద్దులపల్లి ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డు వద్ద ఎంఆర్‌సీలు, గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ గార్డులకు ఎంపీడీఓ తేజోత్స్న శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. స్వచ్ఛ రథం ద్వారా చెత్తను ఇచ్చి ఇంటికి కావాల్సిన వస్తువులు తీసుకోవడంపై అవగాహన కల్పించారు. డిప్యూటీ ఎంపీడీఓ అశ్వర్థమ నాయుడు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.




యాడికిలో, పామిడి మండలం ఎద్దులపల్లిలో చెత్త తీసుకొని సరుకులు అందజేస్తున్న సిబ్బంది

కళాశాల వేళకు బస్సులు నడపాలి



రాస్తారోకో నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

ఉరవకొండ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఉరవకొండ- దర్గాహొన్నూరు మార్గంలో కళాశాల వేళలకు అనుగుణంగా బస్సులు నడపాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయకార్యదర్శి హారున్ రషీద్ డిమాండ్ చేశారు. అనంతపురం - గుంతకల్లు రహదారిలోని ఆర్టీసీ డిపో ఎదుట శుక్రవార విద్యార్థులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. పోలీసులు వారికి సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు. సమస్యను ఏపీఎస్ ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు దృష్టికి ఏఐఎస్ఎఫ్ నాయకులు తీసుకెళ్లారు.

విద్యార్థులు నైపుణ్యాలను సాధించాలి

స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ గోవిందరాజులు


మాట్లాడుతున్న స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ గోవిందరాజులు

గుంతకల్లు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని, సానుకూల దృక్పథంతో నైపుణ్యాలను అలవరచుకోవాలని స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేటు డీ గోవిందరాజులు పేర్కొన్నారు. స్థానిక ఎస్కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఏ లక్ష్మయ్య అధ్యక్షతన 'స్వీయ గౌరవం - ఆత్మవిశ్వాస నిర్మాణం' అనే అంశంపై నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడే అంశాలను అలవరచుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ లక్ష్మయ్య మాట్లాడుతూ.. వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోని చదువు నిరర్థకమన్నారు. కార్యక్రమంలో పీఎం ఉచ్ఛతర్ శిక్షా అభియాన్ కో-ఆర్డినేటరు ఏ రవిశంకర్ శర్మ, డబ్ల్యూఈసీ కో-ఆర్డినేటరు బీ వాణిశ్రీ, ఐక్యూఏసీ కో-ఆర్డినేటరు బీ జమీలా బీబీ, అధ్యాపకులు ఎస్ఏ అల్తాఫ్, ఎం నారాయణ, కే రాజశేఖర్, జహరుల్లా, పావని, దేవీ చైతన్య, వనజమ్మ, బీ శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శత జయంతి వేడుకలు


వృద్ధ దంపతులను సన్మానిస్తున్న సాయి భక్తులు

గుత్తి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక షిర్డీ సాయిబాబా దేవస్థానంలో సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో సత్యసాయి బాబా శత జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. 130 మంది పేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు. బ్రాహ్మణ వృద్ధులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సమితి నాయకులు ఎన్‌వీ రమణ, సత్యనారాయణరెడ్డి, విశ్వనాథ్, రాజేంద్ర పాల్గొన్నారు.

సుబ్బరాయసాగర్ డ్యామ్ పరిశీలన


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

పుట్లూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంజీవపురం గ్రామశివారులో ఉన్న సుబ్బరాయసాగర్ డ్యామ్‌ను ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ శుక్రవారం పరిశీలించారు. త్వరగా గేట్‌కు మరమ్మతులు చేసి నీటిని విడుదల చేయాలని అధికారులకు సూచించారు. రైతులు, ప్రజలు అధైర్యపడరాదని, కేటాయించిన విధంగా చెరువులకు నీరు విడుదల చేస్తామని తెలిపారు.

నేడు ఉపాధి హామీ గ్రామసభలు

పామిడి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో శనివారం ఉపాధి హామీ పథకం గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ తేజోత్స్న, ఏపీఓ ఆదినారాయణమ్మ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జాబ్‌కార్డులలో చేర్పులు - మార్పులు, రద్దయిన జాబ్ కార్డుల పునరుద్ధరణకు ఈ సభల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

● బెళుగుప్పలో 22న...
బెళుగుప్ప : మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ నెల 22న ఉపాధి హామీ పథకంపై గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ లక్ష్మీనారాయణ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు గ్యాస్ ఈకేవైసీ శిబిరం

బొమ్మనహాళ్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గ్యాస్ వినియోగదారులకు ఈకేవైసీ శిబిరాన్ని గ్రామ సచివాలయంలో శనివారం నిర్వహిస్తున్నట్లు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు సాయి సుధీర్ శుక్రవారం తెలిపారు. ఈకేవైసీ లేకుంటే సబ్సిడీ, ఇతర సౌకర్యాలు రద్దు అవుతాయన్నారు.

అయ్యప్ప భక్తులపై దాడి అమానుషం

తాడిపత్రి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): శబరిమలలో అయ్యప్ప భక్తులపై దాడి అమానుషమని, కేరళ వామపక్షపార్టీ నేతృత్వంలోని ఎల్‌డీఎఫ్ ప్రభుత్వ హైందవ వ్యతిరేక విధానాలే ఇందుకు కారణమని బీజేపీ గ్రంథాలయ జిల్లా కన్వీనర్ పోతుల గంగాధర్‌యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక తన నివాసంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ..శబరిమల వెళ్లే భక్తులకు కేరళ ప్రభుత్వం కనీస సౌకర్యాలు కల్పించడం లేదని, ఇలాంటి పరిస్థితుల్లో అయ్యప్పసేవా సంఘం, అమృతానందమయ మఠం వంటి ధార్మిక సంస్థలు భక్తులకు సౌకర్యాలు కల్పిస్తుంటే వాటిని అడ్డుకోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.